సమగ్ర సమాచార పత్రిక

ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
బుధవారం, 11.11.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:14 సంచిక: 004
పేజీలు: 08 వెల: రూ. 5

భయం వల్లే

ప్రధాని పదవి వదిలేశా

ఇందిర, రాజీవ్‌ను దారుణంగా హత్య చేశారు

- నా పిల్లలు ఏమవుతారనే ఆందోళన ఏర్పడింది
- పదవి చేపట్టాలని చాలా మంది బలవంతం చేశారు..
- చిన్నప్పటి నుంచే రాహుల్‌కు రాజకీయాలంటే ఆసక్తి అని వెల్లడి
- సోనియా 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకంలో సోనియా




2

కేటీఆర్‌తోనే ఢీ!

కేసీఆర్‌ను పక్కనపెట్టి కేటీఆర్‌నే ప్రధాన ప్రత్యర్థిగా చూస్తున్నారా?

- వ్యక్తిగత విమర్శలతో పొలిటికల్ వార్..
- గడ్డం, గెటప్‌పై సెటైర్ల వెనుక వ్యూహమేంటి?
- తెలంగాణ పాలిటిక్స్‌లో సరికొత్త సమరం!
- పర్సనల్ అటాక్స్ వెనుక పొలిటికల్ స్కెచ్!
- ప్రజా సమస్యలు పక్కకు.. నేతల మధ్య మాటల యుద్ధం!
- కేసీఆర్ సైలెన్స్ తో కేటీఆర్‌కు పెరుగుతున్న ప్రాధాన్యం!



కేసీఆర్ మౌనం.. కేటీఆర్‌కు బాధ్యతలు!

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గతంతో పోలిస్తే ప్రత్యక్ష రాజకీయాల్లో, బహిరంగ సభల్లో, మీడియా ముందుకు రావడం తగ్గించారు. దీంతో అసెంబ్లీ లోపల, బయట ప్రభుత్వంపై విమర్శలు గుప్పించే బాధ్యతను కేటీఆర్, హరీశ్‌రావు ప్రధానంగా తీసుకుంటున్నారు. ముఖ్యంగా కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, సీఎం రేవంత్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో రేవంత్ రెడ్డి కూడా కేటీఆర్‌నే తన ప్రధాన రాజకీయ ప్రత్యర్థిగా ఎంచుకున్నారా? అనే విశ్లేషణలు మొదలయ్యాయి. కేసీఆర్‌ను పక్కనపెట్టి కేటీఆర్‌తోనే రాజకీయ పోరును కొనసాగించడం ద్వారా బీఆర్ఎస్‌లో ఆయన ప్రాధాన్యాన్ని మరింత పెంచుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గడ్డం.. గెటప్.. వ్యక్తిగత విమర్శలు!

ఇటీవలి కాలంలో రేవంత్ రెడ్డి ప్రసంగాల్లో కేటీఆర్ వ్యక్తిగత రూపం, గడ్డం, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటి అంశాలు ప్రస్తావనకు వస్తున్నాయి. గడ్డం పెంచినంత మాత్రాన ఎవరూ రేవంత్ రెడ్డి కాలేరంటూ సీఎం చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపాయి. విధానపరమైన విమర్శలు, ప్రభుత్వ వైఫల్యాలపై చర్చించాల్సిన రాజకీయ వేదిక వ్యక్తిగత విమర్శలకు వేదికగా మారుతోందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే, ఈ వ్యాఖ్యల వెనుక కేవలం రాజకీయ ఆగ్రహమే కాకుండా ప్రత్యర్థి మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసే వ్యూహం కూడా ఉండొచ్చనే విశ్లేషణలు ఉన్నాయి.

రేవంత్ మార్క్ మాస్ పొలిటిక్స్!

కేటీఆర్‌కు ఉన్న అర్బన్, మోడ్రన్ లీడర్ ఇమేజ్‌కు భిన్నంగా తనను తాను కేడర్ నుంచి ఎదిగిన మాస్ నాయకుడిగా ప్రజల్లో నిలబెట్టుకోవాలని రేవంత్ ప్రయత్నిస్తున్నారనే విశ్లేషణలు ఉన్నాయి. తెలంగాణ రాజకీయాల్లో మాస్ ఇమేజ్‌కు ఉన్న ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ తరహా వ్యాఖ్యలు చేస్తున్నారనే అభిప్రాయాలు మిగతా 02లో

ముద్ర, తెలంగాణ బ్యూరో:

తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు సరికొత్త రాజకీయ సమరం కనిపిస్తోంది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం వ్యక్తిగత విమర్శల స్థాయికి చేరింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు తెరలేపుతున్నాయి. ఒకప్పుడు కేసీఆర్‌ను ప్రధాన ప్రత్యర్థిగా భావించిన రేవంత్.. ఇప్పుడు కేటీఆర్‌తోనే నేరుగా తలపడుతున్నారా? కేసీఆర్ రాజకీయంగా మౌనం వహిస్తున్న వేళ.. కేటీఆర్‌ను బీఆర్ఎస్ ప్రధాన ముఖంగా గుర్తిస్తున్నారా? అనే ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి.

లక్ష మందితో మహా పాదయాత్ర




పాల్గొననున్న బీజేపీ చీఫ్ నితిన్ నబిన్

6

- దేశవ్యాప్తంగా చర్చ జరిగేలా ఏర్పాట్లు
- ఎస్ఐఆర్ పై విపక్షాల ప్రచారానికి కౌంటర్
- కోర్ కమిటీలో ఏర్పాట్లపై బండి సంజయ్ సమీక్ష

పొలిటికల్ టెన్షన్!

పీఆర్సీ పెండింగ్‌తో ఉద్యోగుల ఆగ్రహం



- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభావం?
- 51 శాతం ఫిట్‌మెంట్ కోసం ఉద్యోగుల పట్టు..
- పెండింగ్ బిల్లులపై గుర్రు..
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తామంటున్న ఉద్యోగ సంఘాలు
- ఆర్థిక భారం ఒకవైపు.. రాజకీయ ఒత్తిడి మరోవైపు!
- మల్లగుల్లాలు పడుతున్న రేవంత్ సర్కార్

ముద్ర, తెలంగాణ బ్యూరో:

తెలంగాణలో అధికార కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉద్యోగుల అసంతృప్తి కొత్త రాజకీయ తలనొప్పిగా మారుతోంది. రెండో వేతన సవరణ సంఘం (పీఆర్సీ) నివేదిక అమల్లో జరుగుతున్న జాప్యం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ వర్గాల్లో ఆగ్రహాన్ని పెంచుతోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ఉద్యోగ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. మరోవైపు రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈ అసంతృప్తి కాంగ్రెస్ అభ్యర్థుల విజయావకాశాలను దెబ్బతీస్తుందనే ఆందోళన అధికార పార్టీలో మొదలైనట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

మూడేళ్లు దాటినా కొలిక్కిరాని పీఆర్సీ! రెండో పీఆర్సీ ప్రక్రియ ప్రారంభమై మూడేళ్లు దాటుతున్నా ఉద్యోగులకు మాత్రం ఎదురుచూపులు తప్పడం లేదు. 2023 అక్టోబర్‌లో రెండో పీఆర్సీని ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. ఆరు నెలల్లో సిఫార్సులు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే గడువు ముగిసినా నివేదికపై స్పష్టత రాకపోవడంతో ఉద్యోగ సంఘాలు ప్రభుత్వాన్ని నిలదీశాయి.

ఈ ఏడాది మే 2న ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి.. పీఆర్సీ నివేదికను త్వరగా అందించాలని అధికారుల కమిటీని ఆదేశించినట్లు ప్రకటించారు. నివేదిక అందిన తర్వాత దాని ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం సెప్టెంబర్ 18లోగా నివేదిక సమర్పించాలని గడువు విధించినప్పటికీ నవంబర్ వచ్చినా ఉద్యోగుల ప్రధాన డిమాండ్ పరిష్కారం కాలేదు. దీంతో ప్రభుత్వంపై ఉద్యోగ వర్గాల్లో అసహనం పెరుగుతోంది. మిగతా 02లో



ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు?

రష్యా-ఉక్రెయిన్ కీలక చర్చలు

- అబుదాబిలో అమెరికా మధ్యవర్తిత్వం
- యూరప్ భద్రతా వ్యవస్థపైనా చర్చలు

2

భీమిలిలో ఏఐ

డేటా సెంటర్

ఏపీకి భారీ పెట్టుబడులు



- 30కి పైగా ప్రతిపాదనలకు కేబినెట్ ఓకే
- రోబోటిక్స్, ఫిజికల్ ఏఐ పాలసీకి ఆమోదం.. 2036 వరకు అమలు
- మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక పార్కు..
- ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

2

యూపీఎస్సీ తరహాలో

టీజీపీఎస్సీ

బీఆర్ఎస్ హయాంలో అంతా గందరగోళం

- మా ప్రభుత్వం వచ్చాక పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన
- బోర్డులో చిత్తశుద్ధి కలిగిన వ్యక్తుల నియామకం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు



2

13 ఏళ్ల బంధానికి స్వస్తి

విడిపోతున్నట్లు పవన్ కల్యాణ్, లెజినోవో ఉమ్మడి ప్రకటన



- పరస్పర గౌరవంతో విడిపోతున్నామని వెల్లడి
- పిల్లలకు బాధ్యతాయుత తల్లిదండ్రులుగా ఉంటామన్న జంట
- 13 ఏళ్ల క్రితం 'తీన్ మార్' సినిమా సమయంలో పరిచయం

2

వెయ్యి గ్రామాల మైలురాయిని దాటిన

సమగ్ర భూ రీసర్వే

- భూ యజమానుల ప్రయోజనాలకే అత్యంత ప్రాధాన్యత: మంత్రి పొంగులేటి
- ఇప్పటివరకు 1,000 గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ ప్రారంభం
- రెవెన్యూ రికార్డుల ఆధారంగానే సర్వే చేపట్టాలి
- కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలతో ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్

3

రైస్ మిల్లుల పేరుతో భారీ కుంభకోణం


రుణాల సొమ్ము పక్కదారి.. రూ.18.33 కోట్ల ఆస్తుల జప్తు



- రూ.18.33 కోట్ల ఆస్తులు అటాచ్!
- ఫోర్జరీ పత్రాలతో రూ.24.57 కోట్ల బ్యాంకు రుణాలు
- పేరిరెడ్డి కుటుంబం, అనుచరుల ఆస్తులపై ఈడీ గురి
- బినామీ పేర్లతో 26 సంస్థల నిర్వహణ
- ఏపీ, తెలంగాణల్లో 55 ఆస్తులు అటాచ్

2

ఇదీ AI ముద్ర




సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
బుధవారం, 11 నవంబర్, 2026

వేళకు భోజనం చేయండి

ఒకేసారి కడుపునిండా తినకుండా తక్కువ మోతాదులో ఎక్కువసార్లు ఆహారం తీసుకోవాలి. పడుకునే సమయానికి కనీసం రెండు గంటల ముందే రాత్రి భోజనం ముగించాలి.



కేటీఆర్‌తోనే ఢీ!



(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తమవుతున్నాయి. మరోవైపు కేటీఆర్ ప్రభుత్వంపై లేవనెత్తుతున్న పరిపాలనా అంశాల నుంచి చర్చను వ్యక్తిగత విమర్శల వైపు మళ్లించే ప్రయత్నమా? అనే ప్రశ్న కూడా ఉత్పన్నమవుతోంది.

ప్రజా సమస్యలు పక్కకు..

మూసీ ప్రక్షాళన, ఆరు గ్యారెంటీల అమలు, విద్యుత్, సాగునీరు, ఇతర ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోంది. ఇలాంటి అంశాలకు సమాధానం చెప్పాల్సిన అధికార పక్షం వ్యక్తిగత విమర్శలకు ప్రాధాన్యం ఇవ్వడం సరికాదని బీఆర్ఎస్ నేతలు ఎదురుదాడి చేస్తున్నారు. ప్రజా సమస్యలపై చర్చ జరగాల్సిన సమయంలో నేతల గద్దం, గెటప్‌లపై రాజకీయాలు చేయడం వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదని విమర్శిస్తున్నారు.

అంతిమంగా ఎవరికి లాభం?

రేవంత్ రెడ్డి కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకోవడం వెనుక రాజకీయంగా పలు కోణాలు కనిపిస్తున్నాయి. కేసీఆర్ గైర్హాజరీలో కేటీఆర్‌ను ప్రధాన ప్రత్యర్థిగా నిలబెట్టడమా? ఆయన రాజకీయ ఇమేజ్‌ను దెబ్బతీయడమా? లేక ప్రజల దృష్టిని ఇతర అంశాల నుంచి మళ్లించడమా? అన్నది చర్చనీయాంశంగా మారింది. ఏది ఏమైనా తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు కేసీఆర్ వర్సెస్ రేవంత్ కంటే రేవంత్ వర్సెస్ కేటీఆర్ పోరే ఎక్కువగా కనిపిస్తోంది. రాజకీయ సమరంలో పైచేయి ఎవరిదన్నది తేలనుంది.

13 ఏళ్ల బంధానికి స్వస్తి

ముద్ర, హైదరాబాద్ :

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్, ఆయన మూడో భార్య అన్నా లెజినోవా తమ వైవాహిక బంధానికి ముగింపు పలుకుతున్నట్లు ప్రకటించారు. 13 ఏళ్ల తమ వివాహ బంధాన్ని పరస్పర అవగాహన, గౌరవంతో ముగించాలని నిర్ణయించుకున్నట్లు సోమవారం రాత్రి ఓ ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. జనసేన అధికారిక మీడియా గ్రూప్ ద్వారా ప్రకటన వెలువడింది. "మా జీవితంలో ఎంతో ముఖ్యమైన సమయాన్ని కలిసి గడిపిన తర్వాత పరస్పర అవగాహన, గౌరవంతో విడిపోవాలని నిర్ణయం తీసుకున్నాం. మా వైవాహిక జీవితం ముగిసినా, మేం మంచి స్నేహితులుగా ఉంటాం. మా చక్కని పిల్లలకు బాధ్యతాయుతమైన తల్లిదండ్రులుగా కొనసాగుతాం" అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. పిల్లల సంతోషం, శ్రేయస్సే తమకు ఎల్లప్పుడూ ప్రాధాన్యమని, ఈ సమయంలో తమ వ్యక్తిగత గోప్యతను గౌరవించాలని వారు కోరారు.

రష్యన్ జాతీయురాలైన అన్నా లెజినోవాను పవన్ కల్యాణ్ 2011లో 'తీన్ మార్' సినిమా చిత్రీకరణ సమయంలో కలిశారు. రెండేళ్ల తర్వాత, 2013 సెప్టెంబర్ 30న హైదరాబాద్‌లో ప్రత్యేక వివాహ చట్టం కింద వీరి వివాహం జరిగింది. వీరికి కుమార్తె పొలెనా అంజనా పవనోవా, కుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్ ఉన్నారు. పవన్ కల్యాణ్‌కు ఇది మూడో వివాహం. గతంలో ఆయన 1997లో నందినిని వివాహం చేసుకొని 2008లో విడాకులు తీసుకున్నారు. ఆ తర్వాత నటి రేణు దేశాయ్‌ను 2009లో వివాహం చేసుకొని 2012లో విడిపోయారు. రేణు దేశాయ్‌తో పవన్‌కు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ప్రకటన వెలువడిన వెంటనే జనసేన వర్గాలు దీనిని ధ్రువీకరించాయి. అయితే, ఈ అంశంపై మరింతగా స్పందించేందుకు నిరాకరించాయి. కొన్ని నెలలుగా వీరి మధ్య చర్చలు జరుగుతున్నాయని, ఫ్యామిలీ కోర్టులో పరస్పర అంగీకారంతో పిటిషన్ దాఖలు చేసినట్లు సమాచారం.



రైస్ మిల్లుల పేరుతో కుంభకోణం



ముద్ర, హైదరాబాద్ :


బ్యాంకు రుణాల పేరుతో భారీ మోసానికి పాల్పడిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ED) కొరడా ఝళిపించింది. కళ్లం మోడర్న్ రైస్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కళ్లం పేరిరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, సహచరులకు చెందిన రూ. 18.33 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ తాత్కాలికంగా జప్తు చేసింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అధికారులు చర్యలు చేపట్టారు. విచారణలో భాగంగా 2010–2013 మధ్య కాలంలో నకిలీ, ఫోర్జరీ ఆస్తి పత్రాలను బ్యాంకులకు తనఖాగా సమర్పించి రూ.24.57 కోట్ల రుణాలు పొందినట్లు ఈడీ గుర్తించింది. ఈ రుణాల నిధులను వ్యాపార అవసరాలకు వినియోగించకుండా ఇతర మార్గాల్లోకి మళ్లించి బ్యాంకుకు భారీ నష్టం కలిగించినట్లు తేలింది. కళ్లం పేరిరెడ్డి తన బంధువులు, ఉద్యోగులు, అనుచరుల పేర్లతో సుమారు 26 సంస్థలను నిర్వహించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. రుణాలు పొందిన మూడు ప్రధాన సంస్థల ఖాతాల నుంచి ఏకంగా రూ. 23.81 కోట్ల నగదును ఉపసంహరించినట్లు బ్యాంకు లావాదేవీల పరిశీలనలో బయటపడింది. ఈ నిధులతో పలు స్థిరాస్తులను కొనుగోలు చేసినట్లు అధికారులు గుర్తించారు. కొన్నింటిని బంధువులు, సహచరుల పేర్లకు బదిలీ చేసినప్పటికీ అసలు లబ్ధిదారుడు పేరిరెడ్డేనని ఈడీ అనుమానాలకు ఆధారాలులభించాయి. ఈ నేపథ్యంలో ఏపీ, తెలంగాణల్లో రూ. 16.88 కోట్ల విలువైన 50 స్థిరాస్తులు, రూ.1.45 కోట్ల విలువైన ఐదు ఫ్లాట్లను కలిపి మొత్తం రూ.18.33 కోట్ల ఆస్తులను మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద అటాచ్ చేసింది. కేసులో మరిన్ని వివరాలపై ఈడీ దర్యాప్తు కొనసాగుతోంది.

ప్రధాని పదవి వదిలేశా

ముద్ర, న్యూఢిల్లీ :

భర్త రాజీవ్ గాంధీ రాజకీయాల్లోకి రావడాన్ని తాను తీవ్రంగా వ్యతిరేకించానని, ఆయన ఆ రంగంలోకి వెళ్లవద్దని వేడుకున్నానని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ వెల్లడించారు. అయితే కుమారుడు రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి రావాలనుకున్నప్పుడు మాత్రం తాను అడ్డుకోలేదని తెలిపారు. తన జీవిత ప్రయాణాన్ని వివరిస్తూ రాసిన 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకంలో ఈ విషయాలను ప్రస్తావించారు. ఈ పుస్తకం మంగళవారం ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. రాహుల్‌కు చిన్నప్పటి నుంచే రాజకీయాలపై ఆసక్తి ఉండేదని సోనియా గుర్తుచేసుకున్నారు. ముప్పు ఉందని తెలిసినా రాజీవ్ ధైర్యంగా రాజకీయాల్లో కొనసాగిన తీరును రాహుల్ గౌరవించేవారని తెలిపారు. రాజీవ్ రాజకీయాల్లోకి వెళ్లవద్దని దశాబ్దాల క్రితమే తాను వేడుకున్నానని, ఆ నిర్ణయం వల్ల కుటుంబం కూడా ప్రమాదకరమైన పరిస్థితుల్లోకి వెళ్లాల్సి వస్తుందని ఆందోళన చెందానని పుస్తకంలో రాశారు. తండ్రి రాజకీయాల్లో కొనసాగడంపై రాహుల్ విభేదించిన సందర్భాలు కూడా ఉన్నాయన్నారు. అయినప్పటికీ రాజీవ్ విలువలు, ధైర్యం పట్ల ఆయనకు ఎంతో గౌరవం ఉండేదని పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ నియోజకవర్గంతో రాహుల్, ప్రియాంక గాంధీ వాద్రాలకు విడదీయలేని అనుబంధం ఉందని సోనియా తెలిపారు. రాహుల్‌ను చిన్నతనంలోనే రాజీవ్ పలుమార్లు అమేథీకి తీసుకెళ్లారని, గ్రామీణ ప్రాంతాల వాస్తవ పరిస్థితులను దగ్గరగా పరిచయం చేసేందుకు కూడా ప్రయత్నించారని గుర్తుచేసుకున్నారు. ప్రియాంక కూడా కుటుంబం పోటీ చేసిన ప్రతి ఎన్నికలో అమేథీలోనే ఉండి పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు దగ్గరయ్యారని చెప్పారు.

అయితే ఆ సమయంలో ప్రియాంక ప్రధానంగా తన పిల్లల పెంపకం, బౌద్ధ అధ్యయనాల్లో పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా పూర్తి చేయడం



పై దృష్టి పెట్టారని సోనియా వివరించారు. రాహుల్ విదేశాల నుంచి భారత్‌కు వచ్చినప్పుడల్లా తాను లేదా ప్రియాంకతో కలిసి అమేథీకి వెళ్లేవారని తెలిపారు. ఆ పర్యటనల సమయంలోనే అక్కడి ప్రజలతో మరింతగా మమేకమై, వారి తరఫున పనిచేయాలనే ఆసక్తి రాహుల్‌లో పెరిగిందని పేర్కొన్నారు. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో రాహుల్ ఎంఫిల్ కోసం డెవలప్‌మెంట్ స్టడీస్ ఎంచుకున్నారని సోనియా తెలిపారు. విదేశాల్లో ఉద్యోగం చేస్తున్న సమయంలోనూ భారత్‌లో రాజకీయ పరిణామాలను నిశితంగా గమనించేవారని చెప్పారు. రాహుల్ క్రియాశీల రాజకీయాల్లోకి రావాలని పార్టీ నేతలు బలంగా కోరారని, ఆ నిర్ణయం తీసుకుంటే ఆయన జీవన విధానం పూర్తిగా మారిపోతుందని వివరించారు. ప్రజా జీవితంలోకి వచ్చాక ప్రతి అడుగునా పరిశీలన, విమర్శలు ఎదుర్కోవాల్సి ఉంటుందని రాహుల్‌కు తెలుసన్నారు. తనతో, ప్రియాంకతో చర్చించిన తర్వాత, చాలాసేపు ఆలోచించి ఆయన రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకున్నారని సోనియా వెల్లడించారు. 2004, మార్చిలో అమేథీ నుంచి పోటీ చేస్తానని రాహుల్ ప్రకటించారు. సోనియా గాంధీ పక్కనే ఉన్న రాయ్‌బరేలీ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగారు. తొలి ఎన్నికలోనే రాహుల్ భారీ మెజార్టీతో గెలిచారని సోనియా పేర్కొన్నారు. అనంతరం తన బాధ్యతలను ఉత్సాహంగా స్వీకరించి, రాజీవ్ గాంధీ తరహాలో గ్రామీణ అమేథీలో పరిశ్రమలు, వ్యాపార సంస్థల ఏర్పాటుకు కృషి చేశారని తెలిపారు.

భూమిలిలో ఏఐ డేటా సెంటర్



ముద్ర, అమరావతి:

విశాఖ జిల్లా భీమిలి మండలం అమనాంలో 512 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు సహా 30కి పైగా అజెండా అశాలకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. సీఎం నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముగిసింది. ఈ భేటీలో ఐటీ, పరిశ్రమలు, రెవెన్యూ, హోంశాఖలకు సంబంధించిన పలు అంశాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అందులో భాగంగా 2026–31 కాలానికి గానూ ఏపీ ఏవీజీసీ–ఎక్స్‌ఆర్ (AVGC–XR) పాలసీ ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా అన్నమయ్య జిల్లాలో 56.82 ఎకరాల విస్తీర్ణంలో ఫుట్‌వేర్ కాంపోనెంట్ పార్క్, ఎన్టీఆర్ జిల్లా జయంతిపురంలో 30 ఎకరాల్లో ఎఫ్ఎల్‌వో (FLO) మహిళా పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటితో పాటు పలు ఇంధన ప్రాజెక్టులతో పాటు వివిధ జిల్లాల్లో బయోగాస్ ప్లాంట్‌ల ఏర్పాటుకు చంద్రబాబు కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే ఏపీ పోలీసు శాఖలో భద్రతను మరింత మెరుగుపరచేందుకు ప్రత్యేక ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ సేఫ్టీ డైరెక్టరేట్ ఏర్పాటుకు మంత్రివర్గం అంగీకారం తెలిపింది. మంగళగిరిలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఐజీ స్థాయి అధికారి నేతృత్వంలో ఈ కొత్త విభాగాన్ని నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. నాయుడుపేటలో లిథియం బ్యాటరీ మెటీరియల్ తయారీ పరిశ్రమ స్థాపిస్తుండగా, రూ. 4,000 కోట్లతో కార్బన్ కార్బో సంస్థ పరిశ్రమ ఏర్పాటుపై కూడా మంత్రులు చర్చించారు.

ఏపీ కేబినెట్ ఆమోదించిన ఇతర కీలక ప్రతిపాదనల వివరాలు

2036 వరకు అమల్లో ఉండేలా రోబోటిక్స్, ఫిజికల్ ఏఐ (AI) పాలసీ ఆమోదం

విశాఖపట్నం జిల్లా భీమిలి మండలం అమనాంలో 512 మెగావాట్ల ఏఐ (AI) డేటా సెంటర్ ఏర్పాటుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్.

సెమీకండక్టర్, డిస్‌ప్లే ఫ్యాబ్ పాలసీ–4.0 లో అవసరమైన సవరణలు చేయడానికి నిర్ణయం తీసుకున్నారు.

అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో ఈప్యాక్ డేటా సెంటర్ (Data Center) యూనిట్ ఏర్పాటు.

పీఆర్సీ పెండింగ్‌తో ఉద్యోగుల ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

51 శాతం ఫిట్‌మెంట్.. రూ.10 వేల కోట్ల బకాయిలు!


పీఆర్సీ నివేదికను వెంటనే విడుదల చేసి అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ పట్టుబడుతోంది. 2023, జులై 1 నుంచి కొత్త వేతనాలు అమలు చేస్తూ 51 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని డిమాండ్ చేస్తోంది.

ఇదొక్కటే కాదు.. ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపుల విషయంలోనూ ప్రభుత్వం వేగం పెంచాలని కోరుతోంది. ప్రస్తుతం నెలకు రూ.1,000 కోట్లు కేటాయిస్తుండగా.. ఆ మొత్తాన్ని రూ.2,000 కోట్లకు పెంచాలని డిమాండ్ చేస్తోంది. పాత పెన్షన్ విధానం (OPS) పునరుద్ధరణపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని కోరుతోంది. ఉద్యోగుల పెండింగ్ బిల్లులు రూ.10 వేల కోట్లకు పైగా ఉన్నాయని జేఏసీ నేతలు చెబుతున్నారు.

నవంబర్ 6న హైదరాబాద్‌లోని టీజీవో భవన్‌లో జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించిన సంఘాలు.. దీపావళి తర్వాత ఆందోళన కార్యాచరణ ప్రకటించే దిశగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం. అదే జరిగితే ప్రభుత్వానికి ఉద్యోగ సంఘాలతో మరోసారి ముఖాముఖి తప్పకపోవచ్చు.

ఎమ్మెల్సీ ఎన్నికలే టార్గెట్.. నాలుగు లక్షల ఓట్లపై గురి!

ఉద్యోగుల అసంతృప్తి ఇప్పుడు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకోవడానికి ప్రధాన కారణం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు. మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్, వరంగల్–ఖమ్మం–నల్గొండ గ్రాడ్యుయేట్ నియోజకవర్గాల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు గణనీయమైన సంఖ్యలో ఓటర్లుగా ఉన్నారు.



ఈ రెండు నియోజకవర్గాల పరిధిలో నాలుగు లక్షలకు పైగా ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది గ్రాడ్యుయేట్లుగా ఉన్నారని జేఏసీ నేతలు పేర్కొంటున్నారు. వీరిలో చాలామంది ఇప్పటికే ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నట్లు చెబుతున్నారు. దీంతో ఈ వర్గాల అసంతృప్తి ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తారా?

తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే కాంగ్రెస్ అభ్యర్థులకు వ్యతిరేకంగా ఓటు వేయడమే కాకుండా.. వ్యక్తిగత స్థాయిలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తామని కొందరు ఉద్యోగులు హెచ్చరిస్తున్నట్లు సమాచారం. ఉద్యోగ సంఘాల ఆందోళన ఎన్నికల ప్రచార స్థాయికి చేరితే అధికార పార్టీకి ఇబ్బందులు తప్పకపోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ పీఆర్సీ, పెండింగ్ డీఏలు, బిల్లుల చెల్లింపులు, పెన్షన్ విధానం వంటి అంశాలు ఇంకా పరిష్కారం కాకపోవడం ప్రభుత్వానికి ప్రతికూలంగా మారుతోంది. ఉద్యోగులు ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తారా? లేక అసంతృప్తిని ఓట్ల రూపంలో చూపిస్తారా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

ఆర్థిక భారం ఒకవైపు.. రాజకీయ ఒత్తిడి మరోవైపు!

రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, పీఆర్సీ అమలుతో పడే అదనపు భారం ప్రభుత్వానికి సవాల్‌గా నిలుస్తున్నాయి. అదే సమయంలో ఉద్యోగ సంఘాల డిమాండ్లను నిర్లక్ష్యం చేస్తే రాజకీయంగా నష్టం జరిగే అవకాశముంది. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించి ఉద్యోగులను శాంతింపజేస్తుందా? లేక ఆందోళనలతో ప్రభుత్వానికి కొత్త తలనొప్పి మొదలవుతుందా? అన్నది చూడాలి. మొత్తానికి పీఆర్సీ నివేదిక ఇప్పుడు కేవలం ఉద్యోగుల వేతనాల అంశంగానే కాకుండా.. కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజకీయ పరీక్షగా మారుతోంది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ముందు ఉద్యోగుల ఆగ్రహానికి ప్రభుత్వం ఎలాంటి పరిష్కారం చూపుతుందన్నదే కీలకం కానుంది.

ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు?

ముద్ర, న్యూఢిల్లీ :

నాలుగున్నరేళ్లుగా ప్రపంచాన్ని వణికిస్తున్న రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే దిశగా మరోసారి కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. వేలాది మంది ప్రాణాలను బలిగొన్న ఈ భీకర యుద్ధానికి శాశ్వత పరిష్కారం కనుగొనే లక్ష్యంతో అమెరికా మధ్యవర్తిత్వంలో రష్యా, ఉక్రెయిన్ ప్రతినిధులు అబుదాబిలో చర్చలకు సిద్ధమయ్యారు. ఇరు దేశాల మధ్య నెలకొన్న తీవ్ర విభేదాలను పక్కనపెట్టి చర్చల టేబుల్‌పైకి రావడం అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

ఈ చర్చల్లో కేవలం కాల్పుల విరమణకే పరిమితం కాకుండా యుద్ధానికి దారితీసిన కీలక సమస్యలన్నింటినీ పరిష్కరించే అంశంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆక్రమిత భూభాగాల భవిష్యత్తు, సరిహద్దుల వివాదం, ఉక్రెయిన్‌కు భద్రతా హామీలు వంటి అంశాలు చర్చల్లో కీలకంగా మారనున్నాయి. రష్యా తన భద్రతాపరమైన ఆందోళనలను ప్రస్తావిస్తుండగా.. భవిష్యత్తులో మరోసారి దాడులు జరగకుండా పటిష్టమైన అంతర్జాతీయ హామీలు కావాలని ఉక్రెయిన్ కోరుతోంది.

మరోవైపు, ఈ యుద్ధం ప్రభావం కేవలం రష్యా, ఉక్రెయిన్ దేశాలకే పరిమితం కాలేదు. యూరప్ భద్రత, అంతర్జాతీయ ఇంధన మార్కెట్లు, ఆహార సరఫరా వ్యవస్థ, ప్రపంచ ఆర్థిక పరిస్థితులపైనా తీవ్ర ప్రభావం చూపింది. దీంతో భవిష్యత్తులో యూరప్‌లో భద్రతా వ్యవస్థ ఎలా ఉండాలి? నాటో కూటమి పాత్ర ఏమిటి? రష్యా, యూరప్ దేశాల మధ్య సంబంధాలను తిరిగి సాధారణ స్థితికి తీసుకురావడం ఎలా? వంటి అంశాలు చర్చల్లో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అమెరికా ఈ చర్చల ద్వారా ఇరు దేశాల మధ్య నమ్మకాన్ని పెంచడంతో పాటు దశలవారీగా యుద్ధాన్ని ముగించే మార్గాన్ని అన్వేషిస్తోంది. అయితే భూభాగాల విషయంలో రష్యా, ఉక్రెయిన్ తమ వైఖరులకు కట్టుబడి ఉండటం చర్చలకు ప్రధాన సవాలుగా మారే అవకాశం ఉంది. ఏకాభిప్రాయం సాధించడం అంత సులభం కాకపోయినా దౌత్యపరమైన ప్రయత్నాలు మళ్లీ ఊపందుకోవడం ఆశాజనక పరిణామంగా భావిస్తున్నారు.

మొత్తంగా అబుదాబి వేదికగా జరుగుతున్న ఈ చర్చలు రష్యా–ఉక్రెయిన్ యుద్ధ భవిష్యత్తును నిర్ణయించడంలో కీలకంగా మారనున్నాయి. చర్చలు సఫలమైతే నాలుగున్నరేళ్లుగా కొనసాగుతున్న రక్తపాతానికి ముగింపు పలికే అవకాశం ఉంటుంది. లేదంటే యుద్ధం మరింత కాలం కొనసాగి ప్రపంచ దేశాలపై ఆర్థిక, భద్రతాపరమైన ఒత్తిడిని పెంచే ప్రమాదం ఉంది. ఇప్పుడు ప్రపంచ దేశాల చూపంతా అబుదాబిలో ఈ కీలక సంప్రదింపులపైనే నిలిచింది.

యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీ

ముద్ర, హైదరాబాద్:

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను యూపీఎస్సీ తరహాలో తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. గతంలో టీఎస్‌పీఎస్సీ రాజకీయ పునరావాస కేంద్రంగా మారిందని, అవగాహన లేని వ్యక్తులను బోర్డులో నియమించడం వల్లే నియామక ప్రక్రియలో గందరగోళం ఏర్పడిందని విమర్శించారు. నేను బాధ్యతలు స్వీకరించాక పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి అనుభవం, చిత్తశుద్ధి కలిగిన వ్యక్తులను బోర్డులో నియమించామని తెలిపారు. మంగళవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో శిక్షణ పూర్తి చేసుకున్న డీఎస్పీలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డీజీపీ సీవీ ఆనంద్, భద్రతా సలహాదారు శివధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. గతంలో గ్రూప్–1 నియామకాల ప్రక్రియలో జరిగిన పరిణామాలను వివరించారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో 2011లో గ్రూప్–1 నియామకాలు జరిగాయని, ఆ తర్వాత దాదాపు 13 ఏళ్ల పాటు నియామక ప్రక్రియ ముందుకు సాగలేదని సీఎం గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్లు, ప్రవేశ పరీక్షల విషయంలో తీవ్ర గందరగోళం నెలకొందన్నారు. ఆనాటి ప్రభుత్వ నిర్ణయాలు, నిర్లక్ష్యం కారణంగా ఎంతోమంది అభ్యర్థులు నష్టపోయారని పేర్కొన్నారు. 563 గ్రూప్–1 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయగా 562 మంది ఉద్యోగాల్లో చేరారని వెల్లడించారు. గ్రూప్–1 నియామక ప్రక్రియపై కొందరు ఉద్దేశపూర్వకంగా వివాదాలు సృష్టించారని సీఎం ఆరోపించారు.

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఓపికగా వినాలని, బాధితుల సమస్యలను పూర్తిగా అర్థం చేసుకుని పరిష్కారానికి కృషి చేయాలని సీఎం సూచించారు. తెలంగాణ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని, విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు నడిపించే బాధ్యత యువ అధికారులపై ఉందని పేర్కొన్నారు. విధులు నిర్వహించాలని మాత్రమే ఆశిస్తున్నానట్లు స్పష్టం చేశారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన ట్రైనీ డీఎస్పీలకు సీఎం రేవంత్ రెడ్డి మెడల్స్ అందజేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 11.11.2026
www.mudranews.in | @mudranews

రోజూ 30 నిమిషాల వ్యాయామం

నడక, యోగా వంటి వ్యాయామాలతో పేగుల కదలికలు మెరుగుపడతాయి. మలబద్ధకం తగ్గడంతో పాటు మంచి బ్యాక్టీరియా వృద్ధికి తోడ్పడుతుంది.



జర్నలిస్టుల సంక్షేమానికి

టీయూడబ్ల్యూజే కృషి అభినందనీయం

- వికారాబాద్ సభలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



ముద్ర, వికారాబాద్: రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం దశాబ్దాల తరబడి టీయూడబ్ల్యూజే చేస్తున్న కృషి అభినందనీయమని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం నాడు వికారాబాద్ పట్టణంలోని సత్యభారతి ఫంక్షన్ హాలులో జరిగిన తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టీయూడబ్ల్యూజే) వికారాబాద్ జిల్లా తృతీయ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సమాజంలో ఎంతో గౌరవప్రదమైన జర్నలిజం వృత్తి పక్కదారి పట్టకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీడియా సంస్థలపై, జర్నలిస్టులపై ఉంటుందని స్పీకర్ సూచించారు. ముఖ్యంగా ప్రజలకు పక్షపాతిగా వ్యవహరిస్తూ, వారి హక్కులకు భంగం వాటిల్లకుండా ఉండేందుకు జర్నలిస్టులు చురుకైన పాత్ర పోషించాలని ఆయన తెలిపారు. సంచలనాలు, కల్పితాలు, అవాస్తవాలకు దూరంగా వృత్తి ధర్మాన్ని పాటిస్తూ, నిజాయితీగా సమాచారాన్ని అందించే మీడియా సంస్థలను, జర్నలిస్టులను ప్రజలు అక్కున చేర్చుకుంటారని ప్రసాద్ కుమార్ స్పష్టం చేసారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడివుందని, దశల వారీగా వాటి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు ఆయన అన్నారు. వికారాబాద్ జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు అందించామని, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డుల కోసం తమ వంతు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సభకు గౌరవ అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతూనే మరోవైపు జర్నలిస్టుల్లో నైతిక విలువలను పెంపొందించేందుకు తమ సంఘం 75యేండ్లుగా కృషి చేస్తుందని ఆయన అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో జర్నలిస్టులకు అందుతున్న సౌకర్యాలన్నీ తమ సంఘం పోరాట ఫలితమేనన్నారు. రాష్ట్రంలో అకాల మరణం చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు 5లక్షల రూపాయల ఆర్థిక సహాయం, జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, హెల్త్ కార్డులను అందించి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని విరాహత్ అలీ ప్రభుత్వాన్ని కోరారు. అలాగే మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు మీడియా అకాడమీ నుండి ప్రస్తుతం అందిస్తున్న తక్షణ సహాయాన్ని లక్షా రూపాయల నుండి 2లక్షలకు పెంచాలని, ఐదేళ్ల పాటు ప్రతి నెల మృతుని భార్యకు చెల్లించే 3వేల రూపాయల పెన్షన్ ను 10వేల రూపాయలకు పెంచాలని ఆయన కోరారు. ఇంకా ఈ సభలో శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, తాండూర్ శాసన సభ్యులు మనోహర్ రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ, ఐజేయు జాతీయ ఉపాధ్యక్షులు వై. నరేందర్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి మోతే వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహాచారి, శ్రీధర్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సలీంలతో పాటు దాదాపు 300మంది జర్నలిస్టులు పాల్గొన్నారు.



అందెశ్రీకి సీఎం రేవంత్ రెడ్డి ఘన నివాళి

ముద్ర, తెలంగాణ బ్యూరో: ప్రజాకవి స్వర్గీయ అందెశ్రీ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవాన్ని తన సాహిత్యం, పాటల ద్వారా ప్రజల్లో నింపిన మహనీయుడని కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఆయన రచనలు ప్రజల్లో చైతన్యం రగిలించాయని గుర్తుచేశారు. 'జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం' గీతం ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రజల ఆకాంక్షలను అద్భుతంగా ఆవిష్కరించారని పేర్కొన్నారు. తెలంగాణ భాష, యాస, సంస్కృతి ఉన్నంతకాలం అందెశ్రీ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని సీఎం స్మరించుకున్నారు.

రైతు రుణాల రీషెడ్యూలింగ్ చేపట్టాలి

ముద్ర, హైదరాబాద్: రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు బ్యాంకర్లు ప్రత్యేక చొరవ చూపాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. కరువు ప్రభావిత ప్రాంతాల్లో రైతుల పంట రుణాలను ఆర్బీఐ నిబంధనల ప్రకారం మూడేళ్లు లేదా ఐదేళ్ల పాటు రీషెడ్యూలింగ్, రీస్ట్రక్చరింగ్ చేయాలని సూచించారు. రబీ సీజన్ కు నిర్దేశించిన రూ.38,268 కోట్ల పంట రుణాలను వెంటనే మంజూరు చేయాలని కోరారు. డ్రిప్, స్ప్రింక్లర్ సాగుతో పాటు ఆయిల్ పామ్, పాడి పరిశ్రమ, పౌల్ట్రీ వంటి అనుబంధ రంగాలకు విరివిగా రుణాలు అందించాలని తెలిపారు. రైతులు బ్యాంకుల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా బ్యాంకులే ముందుకొచ్చి సహకరించాలని మంగళవారం రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో మంత్రి స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.1 కోటి విరాళం

ముద్ర, అమరావతి : ముఖ్యమంత్రి సహాయ నిధికి కృష్ణా డిస్ట్రిక్ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ తరపున రూ.1 కోటి విరాళాన్ని ఆ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబును సచివాలయంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులుతో పాటు సీఎంను కలిసి చెక్కును అందించారు. తుఫాన్‌లతో పంటలు నష్టపోయిన రైతులకు అండగా నిలిచేందుకు కేడీసీసీ బ్యాంక్ కామన్ గుడ్ ఫండ్ నుంచి ఈ విరాళాన్ని అందిస్తున్నట్లు రఘురామ్ తెలిపారు. రైతులకు అండగా నిలిచేలా సీఎం సహాయ నిధికి విరాళం అందించినందుకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు.

ఆటోమొబైల్, ఈవీ రంగాల్లో భారీ పెట్టుబడులే లక్ష్యం

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు సన్నాహాలు
మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి సమావేశం

ముద్ర, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రాన్ని ఆటోమొబైల్, ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) తయారీ రంగాల్లో దేశంలోనే ప్రముఖ పెట్టుబడి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026 సన్నాహాల్లో భాగంగా ఆటోమొబైల్, ఈవీ రంగాల ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి సమావేశం రేపు తెలంగాణ సచివాలయంలో జరగనుంది. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశాన్ని హైబ్రిడ్ విధానంలో (ఆన్‌లైన్, ఆఫ్‌లైన్) నిర్వహించనున్నారు. సుమారు 25 మంది ప్రముఖ పారిశ్రామికవేత్తలు, వివిధ కంపెనీల ప్రతినిధులు ఇందులో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, కొత్త పరిశ్రమల ఏర్పాటు, ఇప్పటికే కొనసాగుతున్న ప్రాజెక్టులు, పరిశ్రమల విస్తరణ ప్రణాళికలపై మంత్రి పారిశ్రామిక వేత్తలతో చర్చించనున్నారు. ఆటోమొబైల్, ఈవీ వాహనాల తయారీ, బ్యాటరీ టెక్నాలజీ, ఛార్జింగ్ మౌలిక సదుపాయాలు, క్లీన్ మొబిలిటీ, ఆధునిక రవాణా సాంకేతికత వంటి అంశాలపై సూచనలు, సలహాలు స్వీకరించనున్నారు. గ్లోబల్ సమ్మిట్‌తో పాటు నిర్వహించనున్న ఇన్వెస్ట్‌మెంట్ ఎక్స్‌పోలో ప్రముఖ కంపెనీల భాగస్వామ్యాన్ని కోరడంతో పాటు, సమ్మిట్‌లో ఆటోమొబైల్, ఈవీ రంగాలపై నిర్వహించే ప్రత్యేక సమావేశంలో చర్చించాల్సిన అంశాలను కూడా ఖరారు చేయనున్నారు.



23 మంది ప్రముఖ ప్రతినిధులకు ఆహ్వానం

ఈ సమావేశంలో ఏవీఎల్ ఇండియా సీఈఓ నవీద్ నారాయణ, బాష్ గ్లోబల్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ వైస్ ప్రెసిడెంట్ అమ్జద్ ఖాన్ పఠాన్, జెడ్ఎఫ్ టెక్ సెంటర్ ఇండియా హెడ్ కృష్ణస్వామి జంబునాథన్, టాఫే గ్రూప్ ప్రతినిధి రాజీవ్ నాగ్, ఏథర్ ఫౌండర్ తరుణ్ మెహతా, జియో బీపీ ప్రతినిధి రూబిన్ పాథర్, సిగ్నా ఎనర్జీ సీఈఓ వెంకట్ రాజారామన్ తదితర ప్రముఖులు పాల్గొననున్నారు. అలాగే టెరి, డబ్ల్యూఆర్ఐ ఇండియా, అసోచామ్, యూఎస్–ఇండియా బిజినెస్ కౌన్సిల్, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా తదితర సంస్థల ప్రతినిధులు కూడా సమావేశంలో భాగస్వాములు కానున్నారు.

పెట్టుబడులకు అనుకూల వాతావరణంపై దృష్టి

పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ విధానాలు, పెట్టుబడిదారులకు అందించాల్సిన సహకారం, పరిశ్రమలు–ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయంపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. తెలంగాణను ఆటోమొబైల్, ఈవీ రంగాలకు ప్రధాన పెట్టుబడి గమ్యస్థానంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నారు. ఈ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశానికి కన్వీనర్‌గా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖకు చెందిన లాజిస్టిక్స్, సప్లై చైన్, ఆటోమొబైల్, ఈవీ విభాగం డైరెక్టర్ జొజాద్ షేక్ వ్యవహరిస్తున్నారు. ప్రపంచస్థాయి పెట్టుబడులను ఆకర్షించడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రాష్ట్రానికి తీసుకురావడం, కొత్త పరిశ్రమలు, ఉపాధి అవకాశాలను పెంపొందించడం ద్వారా తెలంగాణను ఆటోమొబైల్, ఈవీ రంగాల్లో కీలక కేంద్రంగా నిలబెట్టేందుకు ఈ సమావేశం దోహదపడనుంది.

కూకట్‌పల్లిలో భూముల వేలాన్ని అడ్డుకుంటాం

- ఎంపీ ఈటల

ముద్ర, హైదరాబాద్: ప్రజా అవసరాలకు వినియోగించాల్సిన హౌసింగ్ బోర్డు భూములను ప్రభుత్వం విక్రయించడంపై మల్కాజిగిరి భాజపా ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భూముల విక్రయాలను నిరసిస్తూ భాజపా అధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో ఆయన పాల్గొన్నారు. కూకట్‌పల్లిలో జనసాంద్రత అధికంగా ఉన్నందున పార్కులు, ఆటస్థలాలు, ఇతర మౌలిక సదుపాయాల కోసం భూములు కేటాయించాలని డిమాండ్ చేశారు. స్థానికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా భూములను వేలం వేయడం సరికాదన్నారు. రైతుల నుంచి సేకరించిన ట్రాక్ పార్కు స్థలాన్ని సైతం విక్రయానికి పెట్టడం ఏంటని ప్రశ్నించారు. ఈనెల 12న జరగనున్న భూముల వేలాన్ని కాలనీవాసులతో కలిసి అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

దేశం గర్వించేలా ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహించాలి

తెలంగాణ ప్రతిష్టను చాటిచెప్పేలా ఏర్పాట్లు చేయాలి..
రూ.203 కోట్లతో నిర్వహణ పనులు: మంత్రి వాకిటి శ్రీహరి

ముద్ర, హైదరాబాద్: ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026ను దేశం గర్వించేలా, తెలంగాణ ప్రతిష్టను జాతీయ స్థాయిలో చాటిచెప్పేలా విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదల, కృషి వల్లే తెలంగాణకు ఈ ప్రతిష్ఠాత్మక క్రీడా పోటీల నిర్వహణ అవకాశం దక్కిందని తెలిపారు. బేగంపేటలోని టూరిస్ట్ ప్లాజాలో డిప్యూటీ కలెక్టర్లు, క్రీడా శాఖ అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఖేలో ఇండియా నిర్వహణను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ప్రతి అధికారి బాధ్యతతో పనిచేసి ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అనవసర ఖర్చులకు తావివ్వకుండా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలు సాధించాలని సూచించారు. క్రీడా మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయాలని, ఇందుకోసం డిప్యూటీ కలెక్టర్లకు పూర్తి అధికారాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. యువత రీల్స్, సోషల్ మీడియా, బెట్టింగ్‌లకు ఆకర్షితులు కాకుండా క్రీడల వైపు మళ్లించాలని మంత్రి పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను గుర్తించి సరైన శిక్షణ, ప్రోత్సాహం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి



మాట్లాడుతూ.. ఖేలో ఇండియా నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని, పనుల్లో నాణ్యత, వేగం ఉండాలని స్పష్టం చేశారు. అలసత్వం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వ స్పెషల్ సీఎస్ వాణీ ప్రసాద్ మాట్లాడుతూ.. ఖేలో ఇండియా నిర్వహణ కోసం మొత్తం రూ.203 కోట్లతో ఏర్పాట్లు చేస్తున్నామని, ఇందులో రూ.120 కోట్లతో క్రీడా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ వీసీ అండ్ ఎండీ సోనిబాలాదేవి మాట్లాడుతూ.. ఇప్పటికే 11 స్టేడియాలు సిద్ధమయ్యాయని, మరో ఐదు స్టేడియాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఈ సమావేశంలో వివిధ జిల్లాల డిప్యూటీ కలెక్టర్లు, క్రీడా శాఖ అధికారులు పాల్గొన్నారు.

వెయ్యి గ్రామాల మైలురాయిని దాటిన సమగ్ర భూ రీసర్వే



భూ యజమానుల ప్రయోజనాలకే అత్యంత ప్రాధాన్యత: మంత్రి పొంగులేటి
ఇప్పటివరకు 1,000 గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ ప్రారంభం
416 గ్రామాల్లో సర్వే పూర్తి
రెవెన్యూ రికార్డుల ఆధారంగానే సర్వే చేపట్టాలి
కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలతో ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్

ముద్ర, హైదరాబాద్ : తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వే వెయ్యి గ్రామాల మైలురాయిని దాటింది. ఇప్పటివరకు 1,000 గ్రామాల్లో సర్వే ప్రక్రియ ప్రారంభం కాగా, 416 గ్రామాల్లో పూర్తయిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. తరతరాలుగా పరిష్కారం కాని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూ యజమానికి స్పష్టమైన హక్కులు, కచ్చితమైన సరిహద్దులు కల్పించడమే సమగ్ర భూ రీసర్వే ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఈ చారిత్రాత్మక కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. మంగళవారం సచివాలయంలో రెవెన్యూ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో రీసర్వే పురోగతి, క్షేత్రస్థాయి సమస్యలు, సాంకేతిక అంశాలపై మంత్రి చర్చించారు. సర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, శాస్త్రీయంగా నిర్వహించాలని అధికారుల ను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 10,954 రెవెన్యూ గ్రామాలు ఉండగా, తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల్లో జిల్లాకు 70 గ్రామాల చొప్పున మొత్తం 2,720 గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇందులో నక్షాలు అందుబాటులో లేని గ్రామాలను కూడా చేర్చినట్లు పేర్కొన్నారు.

రెవెన్యూ రికార్డుల ఆధారంగానే సర్వే

గ్రామాల్లో సర్వే ప్రారంభించే ముందు సంబంధిత రెవెన్యూ రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించాలని మంత్రి సూచించారు. భూముల విస్తీర్ణం, యాజమాన్య హక్కులు, సరిహద్దుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టాలన్నారు.

అభ్యంతరాలకు అవకాశం కల్పించాలి

సర్వే పూర్తయిన తర్వాత భూ యజమానులకు తప్పనిసరిగా నోటీసులు జారీ చేయాలని, సర్వేలో నమోదైన వివరాలను పరిశీలించుకునేందుకు అవకాశం కల్పించాలని ఆదేశించారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాటిని స్వీకరించి, నిబంధనల ప్రకారం పరిష్కరించాలన్నారు. సర్వే విధానం, నోటీసుల జారీ, అభ్యంతరాల నమోదు, పరిష్కార ప్రక్రియపై గ్రామస్థాయిలో రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

చిన్న పొరపాటుకూ తావివ్వొద్దు

రీసర్వేలో చిన్నపాటి పొరపాట్లు కూడా భవిష్యత్తులో పెద్ద భూ వివాదాలకు దారితీయవచ్చని మంత్రి హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో లోపాలు గుర్తిస్తే వెంటనే సరిదిద్దాలని, భూ యజమానుల అభిప్రాయాలు, సూచనలకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.

భూదార్ కేటాయింపును వేగవంతం చేయాలి

రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ప్రతి భూమికి ఆధార్ తరహాలో ప్రత్యేక గుర్తింపు కల్పించే భూదార్ నంబర్ల కేటాయింపును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. భూముల హక్కులు, విస్తీర్ణాలు, సరిహద్దులకు సంబంధించి స్పష్టమైన రికార్డులు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

బుధవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

రీసర్వే పురోగతి, క్షేత్రస్థాయి సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లతో ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సమీక్షలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ సెటిల్‌మెంట్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, జాయింట్ డైరెక్టర్ ప్రసన్నలక్ష్మి తదితర అధికారులు పాల్గొన్నారు.

ఓంకారేశ్వర ఆలయ అభివృద్ధికి రూ.1,108 కోట్ల వ్యయంపై అభ్యంతరం

ముద్ర, హైదరాబాద్: మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధ్వర్యంలో శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.1,108.27 కోట్లు కేటాయించడంపై ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ భారీ వ్యయ ప్రతిపాదనను పునఃపరిశీలించి, అభివృద్ధి పనులను తాత్కాలికంగా నిలిపివేయాలని MRDCL బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌కు విజ్ఞప్తి చేసింది. ఇప్పటికే గోదావరి పుష్కరాలకు రూ.1,000 కోట్లు, గోదావరి తీరంలోని ఆలయాల అభివృద్ధికి రూ.2,500 కోట్లు, సమ్మక్క–సారలమ్మ జాతరకు రూ.800 కోట్లు ఖర్చు చేస్తున్న విషయాన్ని గుర్తుచేసింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్న సమయంలో మతపరమైన కార్యక్రమాలకు ప్రజాధనాన్ని భారీగా వెచ్చించడం సరైన నిర్ణయం కాదని ఫోరం అధ్యక్షుడు ఎం. పద్మనాభరెడ్డి పేర్కొన్నారు. ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాలకు నిధులు కేటాయించడంపై ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews

బుధవారం,
11 నవంబర్, 2026

4 వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

వాట్సప్ నం.: 9849623744
మేయిల్: mudradaily@gmail.com

పటాకుల పొగతో ఊపిరితిత్తులకు ముప్పు!

ఈ తప్పులు చేయకండి



పండుగలంటే వెలుగులు, ఆనందాలు, సంబరాలు. దీపావళి వంటి పండుగల సమయంలో బాణసంచా కాల్చడం ఆనవాయితీగా వస్తోంది. అయితే, ఈ సంబరాల వెనుక ఆరోగ్యానికి హాని కలిగించే మరో కోణం కూడా ఉంది. టపాసులు కాల్చడం వల్ల వెలువడే దట్టమైన పొగ, విషపూరిత వాయువులు, సూక్ష్మ ధూళి కణాలు గాలిని కలుషితం చేస్తాయి. ఈ కాలుష్యం ముఖ్యంగా ఆస్తమా, COPD వంటి శ్వాసకోశ సమస్యలతో బాధపడేవారికి తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుంది. అంతేకాకుండా పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, అలర్జీలతో బాధపడేవారిపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది. మరి పటాకుల పొగలో ఎలాంటి కాలుష్య కారకాలు ఉంటాయి? అవి ఊపిరితిత్తులు, కళ్ళను ఎలా ప్రభావితం చేస్తాయి? ఆరోగ్య సమస్యలు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? తెలుసుకుందాం.

పటాకుల పొగలో ఏముంటుంది?

బాణసంచా కాలినప్పుడు గాలిలోకి అనేక రకాల కాలుష్య కారకాలు విడుదలవుతాయి. వీటిలో ప్రధానంగా PM2.5, PM10 వంటి సూక్ష్మధూళి కణాలు ఉంటాయి. ముఖ్యంగా PM2.5 కణాలు చాలా చిన్నవిగా ఉండటం వల్ల శ్వాస ద్వారా ఊపిరితిత్తుల లోతైన భాగాల్లోకి చేరగలవు. కొన్ని సందర్భాల్లో రక్తప్రవాహంపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. వీటితో పాటు సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్లు, కార్బన్ మోనాక్సైడ్ వంటి వాయువులు విడుదల కావచ్చు. బాణసంచాలో ఉపయోగించే రసాయనాలను బట్టి బేరియం, స్ట్రాన్షియం, రాగి, అల్యూమినియం వంటి లోహాల సూక్ష్మ కణాలు కూడా గాలిలో కలుస్తాయి. ఒకే ప్రాంతంలో పెద్ద సంఖ్యలో టపాసులు కాల్చినప్పుడు ఈ కాలుష్య కారకాల సాంద్రత ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉంది.

ఎలా ప్రభావితం చేస్తుంది?

పటాకుల పొగలోని సూక్ష్మ కణాలు శ్వాస ద్వారా శరీరంలోకి ప్రవేశించి శ్వాసనాళాల్లో చికాకు, వాపును కలిగిస్తాయి. దీనివల్ల శరీరంలో శ్లేష్మం ఉత్పత్తి పెరిగి శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది. ముఖ్యంగా ఎక్కువసేపు దట్టమైన పొగకు గురైనప్పుడు దగ్గు, గొంతులో మంట, ఛాతీలో బరువుగా అనిపించడం, గురక, ఆయాసం వంటి లక్షణాలు కనిపించవచ్చు. ఇప్పటికే ఊపిరితిత్తుల సమస్యలు ఉన్నవారిలో ఈ ప్రభావాలు మరింత తీవ్రంగా ఉండవచ్చు. కొందరిలో శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు, ఇతర ఊపిరితిత్తుల సమస్యలు కూడా తీవ్రతరం కావచ్చు.

ఆస్తమా రోగులకు ప్రమాదకరం?

ఆస్తమా ఉన్నవారిలో శ్వాసనాళాలు సాధారణంగానే సున్నితంగా ఉంటాయి. పొగ, ధూళి, రసాయన వాయువులు వంటి వాటికి గురైనప్పుడు శ్వాసనాళాల్లో వాపు పెరిగి అవి మరింత ఇరుకుగా మారుతాయి. దీనివల్ల అకస్మాత్తుగా దగ్గు, పిల్లికూతలు, ఛాతిలో బిగుతు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడవచ్చు. కొంతమందిలో పటాకుల పొగ ఆస్తమా దాడిని ప్రేరేపించవచ్చు. ముఖ్యంగా ఆస్తమా నియంత్రణలో లేనివారు, తరచూ ఇన్హేలర్లు ఉపయోగించాల్సి వస్తున్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలి. వైద్యులు సూచించిన మందులు, అత్యవసర ఇన్హేలర్‌ను అందుబాటులో ఉంచుకోవాలి.

COPD రోగులు అప్రమత్తంగా ఉండాలి!

క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (COPD) ఉన్నవారికి కూడా పటాకుల పొగ ప్రమాదకరమే. ఈ వ్యాధితో బాధపడేవారిలో శ్వాసనాళాలు ఇప్పటికే దెబ్బతిని ఉంటాయి. అలాంటి వారు కాలుష్యంతో కూడిన గాలిని పీల్చినప్పుడు దగ్గు పెరగడం, కఫం ఎక్కువగా రావడం, గురక, ఆయాసం వంటి సమస్యలు తీవ్రమవుతాయి. కొన్నిసార్లు పరిస్థితి విషమించి ఆసుపత్రిలో చికిత్స పొందాల్సిన అవసరం కూడా రావచ్చు. అందువల్ల COPD రోగులు బాణసంచా పొగకు వీలైనంత దూరంగా ఉండాలి.

కళ్లకు తప్పని ఇబ్బందులు..!

పటాకుల పొగ కేవలం ఊపిరితిత్తులపైనే కాకుండా కళ్లపైనా ప్రభావం చూపుతుంది. పొగలోని సూక్ష్మ ధూళి కణాలు, రసాయన వాయువుల వల్ల కళ్లలో మంట, దురద, ఎర్రబడటం, నీరు కారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొందరిలో ముక్కు, గొంతులో కూడా చికాకు ఏర్పడుతుంది. కళ్లలో మంట లేదా ధూళి పడినట్లు అనిపిస్తే శుభ్రమైన నీటితో కళ్లను మెల్లగా కడుక్కోవాలి. కళ్లను చేతులతో రుద్దకూడదు. తీవ్రమైన నొప్పి, చూపు మసకబారడం లేదా మంట తగ్గకపోతే వెంటనే కంటి వైద్యుడిని సంప్రదించాలి.

పిల్లలు, వృద్ధులకు ఎక్కువ ముప్పు

పిల్లల ఊపిరితిత్తులు ఇంకా అభివృద్ధి చెందుతున్న దశలో ఉంటాయి. అందువల్ల కాలుష్యానికి వారు త్వరగా ప్రభావితమయ్యే అవకాశం ఉంది. వృద్ధుల్లో రోగనిరోధక శక్తి, ఊపిరితిత్తుల పనితీరు తగ్గడం వల్ల సమస్యలు తీవ్రం కావచ్చు. గర్భిణులు, గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు, అలర్జీలతో బాధపడేవారు కూడా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. వీరంతా బాణసంచా కాల్చే ప్రాంతాలకు దూరంగా ఉండటం మంచిది.

ఎలా రక్షించుకోవాలి?

పొగ వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను తగ్గించుకోవడానికి కొన్ని ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి.

ఇంట్లోనే ఉండండి: బాణసంచా కాల్చే సమయంలో, ముఖ్యంగా పొగ ఎక్కువగా ఉన్నప్పుడు బయటకు వెళ్లకుండా ఇంట్లోనే ఉండాలి.

కిటికీలు, తలుపులు మూసేయండి: బయట కాలుష్య గాలి ఇంట్లోకి రాకుండా కిటికీలు, తలుపులు మూసి ఉంచాలి. గాలి నాణ్యత మెరుగుపడినప్పుడు గదులకు గాలి వచ్చేలా చూడాలి.

ఎయిర్ ప్యూరిఫైయర్ ఉపయోగించండి: HEPA ఫిల్టర్ ఉన్న ఎయిర్ ప్యూరిఫైయర్ గదిలోని సూక్ష్మ ధూళి కణాలను తగ్గించడంలో సహాయపడుతుంది. అయితే అన్ని హానికర వాయువులను ఇది తొలగించలేదు.

N95 మాస్క్ ధరించండి: తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వస్తే సరిగ్గా సరిపోయే N95 మాస్క్ ధరించాలి. ఇది సూక్ష్మ ధూళి కణాల నుంచి కొంత రక్షణ కల్పిస్తుంది. అయితే వాయు కాలుష్యంలోని అన్ని వాయువులను అడ్డుకోలేదని గుర్తుంచుకోవాలి.

వ్యాయామాలకు విరామం ఇవ్వండి: పొగ ఎక్కువగా ఉన్న సమయంలో బయట వాకింగ్, జాగింగ్, సైక్లింగ్ వంటి వ్యాయామాలు చేయకూడదు. శ్వాస వేగం పెరిగినప్పుడు ఎక్కువ కాలుష్య కణాలు ఊపిరితిత్తుల్లోకి వెళ్లే అవకాశం ఉంటుంది.

మందులు అందుబాటులో ఉంచుకోండి: ఆస్తమా, COPD రోగులు వైద్యులు సూచించిన మందులు, ఇన్హేలర్లను దగ్గర ఉంచుకోవాలి. మందుల వినియోగంలో వైద్యుల సూచనలను పాటించాలి.

పిల్లలను పొగకు దూరంగా ఉంచండి: చిన్నపిల్లలను బాణసంచా కాల్చే ప్రదేశాలకు తీసుకెళ్లకూడదు. పొగ ఎక్కువగా ఉన్నప్పుడు బయట ఆటలు ఆడనివ్వకూడదు. గాలి నాణ్యతను పరిశీలించండి: బయటకు వెళ్లే ముందు మీ ప్రాంతంలోని ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (AQI)ను పరిశీలించాలి. గాలి నాణ్యత పేలవంగా ఉన్నప్పుడు అనవసర ప్రయాణాలు, బహిరంగ కార్యకలాపాలను తగ్గించాలి.

వైద్యులను ఎప్పుడు సంప్రదించాలి?

పటాకుల పొగకు గురైన తర్వాత కొందరిలో స్వల్ప దగ్గు, గొంతులో మంట వంటి లక్షణాలు కనిపించవచ్చు. అయితే ఈ కింది లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు.

★ తీవ్రమైన దగ్గు, నిరంతర పిల్లికూతలు.
★ శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తీవ్రమైన ఆయాసం.
★ ఛాతీలో నొప్పి లేదా బిగుతుగా అనిపించడం.
★ ఆస్తమా లక్షణాలు అకస్మాత్తుగా పెరగడం.
★ కళ్లలో తీవ్రమైన మంట, చూపు మసకబారడం.

తీవ్రమైన శ్వాస ఇబ్బంది, ఛాతి నొప్పి లేదా మాట్లాడలేనంత ఆయాసం ఉంటే వెంటనే అత్యవసర వైద్య సహాయం పొందాలి. సూచించిన ఇన్హేలర్ ఉపయోగించినా ఉపశమనం లేకపోతే ఆలస్యం చేయకూడదు.

పర్యావరణాన్ని కాపాడుకోవడం బాధ్యత

పండుగలు ఆనందంగా జరుపుకోవడం ఎంత ముఖ్యమో ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యం. సాధ్యమైనంత వరకు బాణసంచా వినియోగాన్ని తగ్గించడం, తక్కువ కాలుష్యాన్ని కలిగించే ప్రత్యామ్నాయాలను ఎంచుకోవడం మంచిది. ముఖ్యంగా ఆస్తమా, COPD వంటి వ్యాధులతో బాధపడేవారు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.

గుర్తుంచుకోండి: పటాకుల వెలుగులు కొన్ని క్షణాలే ఉంటాయి. కానీ వాటి పొగ వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు ఎక్కువకాలం ఇబ్బంది పెట్టవచ్చు. అందుకే పండుగ సంబరాలతో పాటు స్వచ్ఛమైన గాలికి కూడా ప్రాధాన్యత ఇద్దాం. ఆరోగ్యకరమైన వాతావరణంలో పండుగలను ఆనందంగా జరుపుకుందాం.

గమనిక: ఈ కథనం సాధారణ ఆరోగ్య అవగాహన కోసం మాత్రమే. వ్యక్తిగత ఆరోగ్య సమస్యలకు వైద్యుల సలహా తీసుకోవాలి.

దీపావళి తర్వాత దగ్గు వేధిస్తోందా?



దీపావళి సంబరాలు ముగిసినా.. టపాసుల పొగతో కలిగే ఆరోగ్య సమస్యలు మాత్రం కొందరిని ఇంకా వేధిస్తుంటాయి. ముఖ్యంగా దగ్గు, గొంతులో మంట, గొంతు నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి సమస్యలు కనిపిస్తుంటాయి. బాణసంచా కాల్చడం వల్ల వెలువడే పొగ, విషపూరిత వాయువులు, సూక్ష్మధూళి కణాలు శ్వాసకోశ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయి. పండుగ సమయంలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకోవడం పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తుంది. ముఖ్యంగా ఢిల్లీలో కొన్ని సందర్భాల్లో గాలి నాణ్యత సూచీ (AQI) 500 దాటడం కాలుష్య తీవ్రతకు అద్దం పడుతోంది. అయితే దీపావళి తర్వాత వచ్చే ప్రతి దగ్గు ప్రమాదకరమైనదని భావించాల్సిన అవసరం లేదు. కొన్నిసార్లు టపాసుల పొగ కారణంగా తాత్కాలికంగా గొంతు, శ్వాసనాళాల్లో చికాకు ఏర్పడుతుంది. మరి కొన్ని సందర్భాల్లో శ్వాసనాళాల్లో వాపు, ఇన్ఫెక్షన్లు లేదా ఇప్పటికే ఉన్న ఊపిరితిత్తుల సమస్యలు తీవ్రమయ్యే అవకాశం ఉంటుంది. కాబట్టి దగ్గు ఎంతకాలం ఉంటోంది? దాని తీవ్రత ఎలా ఉంది? ఇతర లక్షణాలు ఏమైనా కనిపిస్తున్నాయా? అనే విషయాలను గమనించడం చాలా ముఖ్యం.

ఊపిరితిత్తుల్లో ఏం జరుగుతుంది?

బాణసంచా పొగలో వివిధ రకాల లోహ అవశేషాలు, సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్, PM2.5 వంటి అతి సూక్ష్మధూళి కణాలు ఉంటాయి. ఇవి శ్వాస ద్వారా శరీరంలోకి ప్రవేశించినప్పుడు శ్వాసనాళాల లోపలి పొరపై ప్రభావం చూపి చికాకు, వాపును కలిగిస్తాయి. ఆరోగ్యంగా ఉన్నవారిలో ఈ ప్రభావం కారణంగా పొడి దగ్గు, గొంతులో మంట, దురద, కళ్లలో నీళ్లు రావడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. ఇవి సాధారణంగా పొగ వల్ల ఏర్పడే తాత్కాలిక ప్రతిచర్యలు. ఇలాంటి సమస్యలు సాధారణంగా పొగకు గురైన తర్వాత ఒకటి నుంచి రెండు రోజుల్లో ఎక్కువగా కనిపిస్తాయి. అనంతరం క్రమంగా తగ్గుతూ కొన్ని రోజుల్లో లేదా వారం రోజుల్లో పూర్తిగా తగ్గిపోవచ్చు. అయితే శ్వాసనాళాల్లో వాపు మరింత లోతుగా వ్యాపిస్తే పరిస్థితి భిన్నంగా ఉంటుంది. శ్వాసనాళాల్లో కఫం ఎక్కువగా తయారవడం, అవి సన్నబడటం వంటి సమస్యలు ఏర్పడవచ్చు. దీంతో దగ్గు తీవ్రంగా మారి నిద్రకు, రోజువారీ పనులకు ఆటంకం కలిగిస్తుంది. ముఖ్యంగా తెల్లవారుజామున దగ్గు ఎక్కువగా వేధించవచ్చు. విజిల్ వేసినట్లు శ్వాస శబ్దం రావడం (Wheezing), ఛాతీలో బిగుతుగా అనిపించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, కొద్దిపాటి శారీరక శ్రమకే ఆయాసం రావడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకూడదు.

దగ్గు ఎన్ని రోజుల్లో తగ్గాలి?

దగ్గు ఎంతకాలం కొనసాగుతుందనే విషయం సమస్య తీవ్రతను అంచనా వేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. సాధారణంగా టపాసుల పొగ వల్ల ఏర్పడే స్వల్ప చికాకు కారణంగా వచ్చే దగ్గు సుమారు ఒకటి నుంచి ఏడు రోజుల్లో తగ్గిపోవాలి. ఈ సమయంలో లక్షణాలు క్రమంగా మెరుగుపడాలి. కానీ వారం రోజుల తర్వాత కూడా దగ్గు తగ్గకుండా మరింత ఎక్కువైతే దాన్ని సాధారణ కాలుష్య ప్రభావంగా భావించకూడదు. ఒకటి నుంచి మూడు వారాల పాటు దగ్గు కొనసాగితే వైరల్ ఇన్ఫెక్షన్ తర్వాత ఏర్పడే వాపు, బ్రాంకైటిస్ లేదా శ్వాసనాళాల సున్నితత్వం వంటి సమస్యలు ఉండే అవకాశం ఉంది. మూడు వారాలకు మించి దగ్గు కొనసాగితే తప్పనిసరిగా ఊపిరితిత్తుల వైద్య నిపుణుడిని (Pulmonologist) సంప్రదించాలి. ముఖ్యంగా దగ్గు తగ్గుతోందా? లేక రోజురోజుకూ పెరుగుతోందా? అనే విషయాన్ని గమనించాలి.

ఇప్పటికే శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నవారిపై టపాసుల పొగ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా ఆస్తమా, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (COPD), బ్రాంకైటిస్, బ్రాంకియెక్టాసిస్, క్షయవ్యాధి తర్వాత ఏర్పడిన శ్వాసనాళాల సమస్యలు ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలి. ఆస్తమా బాధితులు పొగ, విషపూరిత వాయువులను పీల్చుకోవడం వల్ల శ్వాసనాళాలు అకస్మాత్తుగా సంకోచించే బ్రాంకోస్పాజమ్ సమస్యకు గురవుతారు. దీనివల్ల తీవ్రమైన ఆయాసం, పిల్లికూతలు, ఆస్తమా అటాక్ వచ్చే ప్రమాదం ఉంటుంది. COPD, బ్రాంకైటిస్ ఉన్నవారిలో ఇప్పటికే శ్వాసనాళాలు సన్నబడి, కఫం ఎక్కువగా ఉత్పత్తి అవుతుంటుంది. అలాంటి వారు టపాసుల పొగకు గురైతే కఫం మరింత పెరిగి, కొద్దిపాటి పనులు చేసినా ఆయాసం రావచ్చు. అంతేకాకుండా కఫం రంగు మారడం, ముఖ్యంగా పసుపు లేదా ఆకుపచ్చ రంగులోకి మారడం ఇన్ఫెక్షన్‌కు సంకేతం కావచ్చు. ఇలాంటి లక్షణాలతో పాటు జ్వరం, శ్వాస ఇబ్బంది ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. నిర్లక్ష్యం చేస్తే ఇన్ఫెక్షన్ న్యుమోనియా వంటి సమస్యలకు దారితీయవచ్చు.

ఈ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం వద్దు!

కొన్ని లక్షణాలు కనిపిస్తే కాలుష్యం తగ్గే వరకు వేచి చూడకుండా వైద్య సహాయం తీసుకోవాలి.

సాధారణ పనులు చేస్తున్నప్పుడే శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలగడం.
ఛాతీలో నొప్పి లేదా బిగుతుగా అనిపించడం.
గుండె వేగంగా కొట్టుకోవడం.
ఇన్హేలర్ వాడినా ఉపశమనం కలగకపోవడం.
దగ్గుతో పాటు రక్తం పడటం.
అధిక జ్వరం, చలి వణుకు రావడం.
పెదవులు నీలం రంగులోకి మారడం.

ముఖ్యంగా పెదవులు నీలం రంగులోకి మారడం, తీవ్రమైన శ్వాస ఇబ్బంది, ఛాతీ నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే అత్యవసర వైద్య సహాయం పొందాలి. ఇప్పటికే శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నవారు సమస్య తీవ్రత పెరిగే వరకు వేచి ఉండకూడదు.

ఎలా కాపాడుకోవాలి?

టపాసుల పొగ నుంచి ఊపిరితిత్తులను రక్షించుకోవడానికి కొన్ని జాగ్రత్తలు పాటించాలి.

ఎక్కువగా బాణసంచా కాల్చే ప్రాంతాలకు దూరంగా ఉండాలి.
ముఖ్యంగా సాయంత్రం, రాత్రి వేళల్లో పొగ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో బయటకు వెళ్లడం తగ్గించాలి.
అత్యవసరంగా బయటకు వెళ్లాల్సి వస్తే N95 మాస్క్ ధరించాలి.
ఆస్తమా, COPD బాధితులు వైద్యులు సూచించిన ఇన్హేలర్లను క్రమం తప్పకుండా వాడాలి.
వైద్యుల సలహా లేకుండా సూచించిన మందులు, ఇన్హేలర్లను ఆపకూడదు.
అవసరమైన టీకాలు తీసుకోని వారు వైద్యుల సూచనల ప్రకారం టీకాల గురించి తెలుసుకోవాలి.
దగ్గు, ఆయాసం వంటి లక్షణాలు పెరుగుతున్నాయా లేదా గమనించాలి.

దీపావళి తర్వాత వచ్చే స్వల్ప దగ్గు, గొంతులో మంట వంటి సమస్యలు సాధారణంగా వారం రోజుల్లో తగ్గిపోవచ్చు. అయితే దగ్గు తీవ్రత పెరగడం, కఫం ఎక్కువ కావడం, పిల్లికూతలు, ఛాతీ బిగుతు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకూడదు. ముఖ్యంగా ఆస్తమా, COPD, బ్రాంకైటిస్ వంటి సమస్యలు ఉన్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలి. లక్షణాలను ముందుగానే గుర్తించి వైద్యులను సంప్రదించడం ద్వారా తీవ్రమైన శ్వాసకోశ సమస్యలను నివారించుకోవచ్చని మణిపాల్ హాస్పిటల్ కన్సల్టెంట్ – రెస్పిరేటరీ మెడిసిన్ డాక్టర్ అనూష సి.ఎం తెలిపారు.

బ్రెయిన్ స్ట్రోక్..

ప్రతీ క్షణం కీలకం

మెదడుకు రక్త సరఫరాలో అంతరాయం ఏర్పడినా, మెదడులో రక్తస్రావం జరిగినా ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. దీనినే బ్రెయిన్ స్ట్రోక్ అంటారు. స్ట్రోక్ లక్షణాలు కని పించిన వెంటనే సాధ్యమైనంత త్వరగా ఆసుపత్రికి చేరుకోవడం అత్యంత కీలకం. చికిత్స అందడంలో ఆలస్యమైతే మెదడుకు తీవ్రమైన నష్టం జరిగి శాశ్వత పక్షవాతానికి దారితీస్తుంది.

మన దేశంలో ప్రతి సంవత్సరం లక్షలాది మంది బ్రెయిన్ స్ట్రోక్ బారి న పడుతున్నారని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముఖం ఒక వైపు వాలిపోవ డం, చేయి లేదా కాలు అక స్మాత్తుగా బల హీనపడటం, మాట తడబడడం, చూపులో మార్పులు రావడం వంటి లక్ష ణాలను సాధారణ నీరసంగా భావించి నిర్ల క్ష్యం చేయవద్దు. రాత్రి సమయంలో ఈ లక్షణాలు కనిపించినా ఉదయం వరకు వేచి చూ డకుండా తక్షణమే వైద్య సహాయం పొందాలని సూచిస్తున్నారు. అక్టోబరు 29న వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ డేను నిర్వహిస్తారు.. ఈ సంద ర్భంగా బ్రెయిన్‌స్ట్రోక్‌పై అవగాహన కల్పిస్తారు.

గోల్డెన్ అవర్‌ను కోల్పోవద్దు...


రక్తనాళంలో రక్తం గడ్డకట్టడం వల్ల వచ్చే ఇస్కీమిక్ స్ట్రోక్‌కు థ్రాంబో లైటిక్ చికిత్స అందించడం ద్వారా రక్తప్రసరణను పునరుద్ధరించే అవకాశం ఉంటుంది. కొందరికి రక్తనాళంలో గడ్డను తొలగించే ప్రత్యేక చికిత్స కూడా అవసరమవుతుంది. ఏ చికిత్స అందిం చాలనేది బ్రెయిన్ స్కాన్, లక్షణాలు ప్రారంభ మైన సమయం, రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి వైద్యులు నిర్ణయిస్తారు.

బీపీ, షుగర్ ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలి

అధిక రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, ధూమపానం, అధిక మద్య పానం, కొన్ని గుండె సం బంధిత సమస్యలు స్ట్రోక్ ముప్పును పెంచుతాయి. వీటిని నియంత్రించడంతో పాటు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించు కోవడం, వైద్యుల సూచనల ప్రకారం మందులు వాడ డం ద్వారా స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు.

చికిత్సతో పాటు థెరపీలూ ముఖ్యం

స్ట్రోక్ వచ్చిన తర్వాత ప్రాణాలను కాపాడటంతో పాటు రోగి తిరిగి సాధ్య మైనంత సాధారణ జీవితం గడిపేలా చేయడం ముఖ్య మే. ఫిజియోథెరపీ, ఆక్యుపేష నల్ థెరపీ, అవసరమైన స్పీచ్ థెరపీతో రోగి కదలికలు, మాట, రోజు వారీ పనులు చేసుకునే సామర్థ్యం మెరు గుపడే అవకాశం ఉంటుంది



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 11.11.2026
www.mudranews.in | @mudranews

మద్యం, పెయిన్ కిల్లర్లకు దూరం

మద్యం జీర్ణాశయం, పేగుల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. నొప్పి నివారణ మాత్రలను తరచుగా వాడటం వల్ల పేగుల్లో వాపు, పుండ్లు ఏర్పడే ప్రమాదం ఉంది.



ఉస్మానియాకు రూ.వెయ్యి కోట్లు ఇస్తామన్న..

ముఖ్యమంత్రి హామీ ఏమైంది?

ఏడాదిన్నరగా నాన్ టీచింగ్ ఉద్యోగుల ఆందోళన
పట్టించుకోని ప్రభుత్వం
వీసీ ఉద్యోగులకు అండగా ఉండాలి..
గవర్నర్ జోక్యం చేసుకోవాలి
తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



ముద్ర, హైదరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీకి రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి ఆ నిధుల ఊసే ఎత్తడం లేదని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శించారు. 35 ఏళ్లుగా నాన్ టీచింగ్ ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందని, ఏడాదిన్నరగా వారు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీ పరిపాలనా భవనం వద్ద ఉద్యోగులు చేపట్టిన ధర్నాలో ఆమె పాల్గొని మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న పరిస్థితులే కొనసాగడం విచారకరమన్నారు. ఉద్యోగులు ఆవేదన చెందుతున్న యూనివర్సిటీ అభివృద్ధి చెందలేదని పేర్కొన్నారు. నాన్ టీచింగ్ ఉద్యోగులకు అండగా ఉండాల్సిన వైస్ ఛాన్సలర్ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. టైమ్ స్కేల్, కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా కొత్త నియామకాలకు ప్రయత్నించడం సరికాదన్నారు. ప్రభుత్వంతో పోరాడి యూనివర్సిటీ ప్రయోజనాలను కాపాడే వీసీలను చరిత్ర గుర్తుంచుకుంటుందని, ఉద్యోగుల సమస్యలను పట్టించుకోకపోతే చరిత్ర క్షమించదని వ్యాఖ్యానించారు.ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలినాన్ పర్మినెంట్ ఉద్యోగులకు అందాల్సిన ప్రయోజనాలు నిలిపివేయడం సరికాదని కవిత అన్నారు. ఉస్మానియాలో 85 శాతం స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సి ఉండగా, భద్రతా సిబ్బంది నియామకాల్లో ఇతర రాష్ట్రాల వారికి ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. దీనిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలపై యూనివర్సిటీ ఛాన్సలర్ హోదాలో గవర్నర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఓపీఎస్ అమలు చేయాలిఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేస్తామన్న హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కవిత డిమాండ్ చేశారు. 2001 నుంచి 2004 వరకు నియమితులైన వారికి ఓపీఎస్, 2004 నుంచి నియమితులైన వారికి కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం వర్తింపజేయాలని కోరారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన మొత్తాలను క్రమం తప్పకుండా జమ చేయాలని, మరణించిన టైమ్ స్కేల్ కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలని సూచించారు.కాంట్రాక్టు ఉద్యోగుల వ్యవస్థను రద్దు చేసి అర్హులైన వారిని పర్మినెంట్ చేయాలని, రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా ఆరోగ్య పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల పోరాటానికి తమ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు శ్రీకాంత్ గౌడ్, ఆకాష్‌కు మద్దతు ఇవ్వాలని ఉద్యోగులను కోరారు.

కవిత నివాసంపై డ్రోన్ కలకలం

బంజారాహిల్స్‌లోని ఇంటిపై డ్రోన్ ఎగురవేత
పోలీసులకు ఫిర్యాదు చేసిన కార్యాలయ సిబ్బంది

ముద్ర, హైదరాబాద్: తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత నివాసంపై డ్రోన్ ఎగురవేయడం కలకలం రేపింది. మంగళవారం సాయంత్రం బంజారాహిల్స్‌లోని ఆమె నివాసం పరిసరాల్లో గుర్తుతెలియని వ్యక్తులు డ్రోన్‌ను ఎగురవేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ ఘటనతో పార్టీ శ్రేణులు ఆందోళనకు గురయ్యాయి.తమ అధినేత నివాసంపై డ్రోన్ ఎగురవేయడాన్ని తీవ్రంగా పరిగణించిన కవిత కార్యాలయ సిబ్బంది బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డ్రోన్‌ను ఎవరు, ఏ ఉద్దేశంతో ఎగురవేశారనే విషయాలపై పోలీసులు విచారణ జరిపి వివరాలు వెల్లడించాల్సి ఉంది.ఇటీవల తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో పార్టీ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్న నేపథ్యంలోనే కవితను రాజకీయంగా లక్ష్యంగా చేసుకుంటున్నారా? అని పార్టీ శ్రేణులు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. అయితే డ్రోన్ ఎగురవేత వెనుక కారణాలు, బాధ్యుల వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

గురుకుల హాస్టల్‌లో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

నీటి సరఫరాపై అసంతృప్తి..
మరుగుదొడ్లు, మూత్రశాలలకు మరమ్మతులు చేయాలని ఆదేశం



ముద్ర, హైదరాబాద్: గడిఅన్నారం డివిజన్ పరిధిలోని జెడ్పీ కార్యాలయం వెనుక ఉన్న గురుకుల హాస్టల్‌ను ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న వసతి, భోజనం, తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలను పరిశీలించి, వారితో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.హాస్టల్‌లో తీవ్ర నీటి సమస్య ఉన్నట్లు గుర్తించిన ఎమ్మెల్యే.. విద్యార్థులు మూడు, నాలుగు అంతస్తులకు సైతం నీటిని స్వయంగా తీసుకెళ్లాల్సి రావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే మొత్తం 60 మూత్రశాలల్లో కేవలం ఎనిమిది మాత్రమే వినియోగంలో ఉండటాన్ని గమనించారు. మిగిలిన వాటికి తక్షణమే మరమ్మతులు చేపట్టి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారం, స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. విద్యార్థుల సంక్షేమం విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు. తనిఖీలో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించి, అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు.ఈ తనిఖీలో మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్‌కుమార్, రమేష్ ముదిరాజ్, బిచినేపల్లి వెంకటేశ్వరరావు, శ్రీశైలం యాదవ్, రమణారెడ్డి, గండి సన్నియాదవ్, కొత్త రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జి.ఓ. నంబర్ 259ను సవరించాలి

బోరుబావుల రంగాన్ని సంక్షోభం నుంచి కాపాడాలి
300 అడుగుల వరకు తవ్వకాలకు అనుమతి ఇవ్వాలి
తెలంగాణ రిగ్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ముస్కు అంజిరెడ్డి

ముద్ర, హైదరాబాద్: బోరుబావుల తవ్వకాల రంగం ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని నివారించి, ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న వేలాది మంది కార్మికులు, డ్రైవర్లు, వ్యాపారుల ఉపాధిని కాపాడాలని తెలంగాణ రిగ్ ఓనర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. నంబర్ 259ను తక్షణమే సవరించి, ఆచరణ సాధ్యమైన నిబంధనలు అమలు చేయాలని అసోసియేషన్ అధ్యక్షుడు ముస్కు అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి. నర్సిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో 41/2 రిగ్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఓరుగంటి లక్ష్మీనారాయణ, అడ్వైజర్ శ్రీనివాసరెడ్డి, డి. కృష్ణ, మోహన్ రెడ్డి, కె. జంగయ్య గౌడ్, జగన్ మోహన్ రెడ్డి, అశోక్ రెడ్డి పాల్గొన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ బోరుబావుల తవ్వకాలపై విధించిన ఆంక్షల కారణంగా రిగ్ కార్మికులు, ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చి పనిచేస్తున్న డ్రైవర్లు, వాల్వ్ కార్మికులు, నిర్మాణ రంగంపై ఆధారపడిన మేసన్లు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రంగం స్తంభిస్తే నిర్మాణ రంగంపైనా తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. Lరిగ్ కార్మికులు, డ్రైవర్లు, వాల్వ్ కార్మికులు, మేసన్లు, ఇతర రంగాలపై ఆధారపడిన వారి జీవనోపాధిని కాపాడాలని, సరైన అనుమతులు, పర్మిట్లు కలిగిన రిగ్ వాహనాలను అకారణంగా అడ్డుకోవడం, వేధించడం, సీజ్ చేయడం వంటి చర్యలను నిలిపివేయాలని కోరారు. ఈ మేరకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలన్నారు. పాత బోర్లకు ఉచిత రిజిస్ట్రేషన్: గతంలో తవ్విన బోరుబావులకు ఎలాంటి జరిమానాలు లేకుండా ఒకేసారి ఉచిత రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. 15 రోజుల్లో అనుమతులు: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోగా అనుమతులు మంజూరు చేయాలి. గడువులోగా అనుమతి రాకపోతే డీమ్డ్ అప్రూవల్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఎండిపోయిన బోరు బావులకు తిరిగి తవ్వకాలు చేపట్టేందుకు కొత్త అనుమతుల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, ఆన్‌లైన్‌లో సమాచారం అందిస్తే సరిపోయేలా నిబంధనలు రూపొందించాలని, అలాగే 300 అడుగుల లోతు వరకు బోర్లు వేసేందుకు అనుమతులు కల్పించాలన్నారు.భూగర్భ జలాల పరిరక్షణకు ప్రభుత్వం చేపట్టే చర్యలకు రిగ్ ఓనర్లు పూర్తిస్థాయిలో సహకరించేందుకు సిద్ధంగా ఉన్నారని అసోసియేషన్ ప్రతినిధులు స్పష్టం చేశారు. అయితే పర్యావరణ పరిరక్షణతో పాటు కార్మికుల జీవనోపాధిని కూడా దృష్టిలో ఉంచుకుని విధానాలు రూపొందించాలని కోరారు. జి.ఓ. నంబర్ 259లో అవసరమైన మార్పులు చేసి, బోరుబావుల రంగాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వారు విజ్ఞప్తి చేశారు.

హౌసింగ్ బోర్డు భూములను

ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం దారుణం

ఎంపీ ఈటల రాజేందర్,
బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు
వడ్డేపల్లి రాజేశ్వరరావు

ముద్ర, కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని కెపీ హెచ్ బీ ప్రభుత్వ భూములను, హుడా ట్రక్ పార్కుకు కేటాయించిన స్థలాలను ప్రభుత్వం వేలం వేసేందుకు సిద్ధపడటంపై భారతీయ జనతా పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వ భూముల విక్రయాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన భారీ నిరసన కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రెస్ మీట్ నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు తమ ప్రాంతంలోని ప్రభుత్వ భూముల వేలం ప్రతిపాదన వల్ల కలగబోయే నష్టాలను, ఎదుర్కొంటున్న ఆందోళనలను ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించిన ఈటల రాజేందర్, వారి సమస్యలను సావధానంగా విని అండగా ఉంటామని హామీ ఇచ్చారు.అనంతరం ఎంపీ ఈటల రాజేందర్ విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు:కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు ఏర్పాటు చేసిన సమయంలోనే భవిష్యత్తు తరాల అవసరాలను, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పార్కులు, క్రీడా మైదానాలు, ఇతర ప్రజా అవసరాల (ఎమినిటీస్) కోసం ప్రత్యేకంగా స్థలాలను కేటాయించారని గుర్తుచేశారు.ఆనాడు కూకట్‌పల్లిని పట్టణ శివారు ప్రాంతంగా గుర్తించి, రవాణా అవసరాల కోసం రైతుల దగ్గర నుంచి భూమిని స్వీకరించి ట్రక్ పార్కింగ్ కోసం కేటాయించారని తెలిపారు.రోజురోజుకూ జనాభా పెరుగుతున్న అత్యంత రద్దీ ప్రాంతంలో ప్రజా అవసరాల కోసం ఉన్న భూములను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం దారుణమన్నారు.పిల్లలకు ఆడుకోవడానికి మైదానాలు, ప్రజలు స్వచ్ఛమైన గాలి పీల్చుకోవడానికి పచ్చదనంతో కూడిన ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కేవలం ఆదాయం సమకూర్చుకోవడమే ధ్యేయంగా విలువైన భూములను అమ్మకానికి పెట్టడం సరికాదని హితవు పలికారు.భూముల వేలం ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలి: వడ్డేపల్లి రాజేశ్వరరావు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, అధికారంలో ఉన్న సమయంలో ప్రభుత్వ ఆస్తులను విక్రయించి లబ్ధి పొందాలని చూడడం దారుణమని విమర్శించారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన నాయకులు, ప్రజలుప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయంగా సాగిన ఈ నిరసన కార్యక్రమంలో మల్కాజిగిరి జిల్లా బీజేపీ అధ్యక్షులు గిరి వర్ధన్ రెడ్డి, నిజాంపేట్ జిల్లా ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు, మూసాపేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్, కంటెస్టెడ్ కార్పొరేటర్ ప్రీతమ్ రెడ్డి వివిధ మోర్చాల నాయకులు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని తమ సంఘీభావాన్ని తెలిపారు.



టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబుతో వ్యాపారవేత్తల భేటీ

సంస్థల అభివృద్ధికి సహకారం,
మార్గదర్శకత్వం కోరిన కంపెనీల ప్రతినిధులు

ముద్ర, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబును క్యూటెక్ సోల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, లైఫ్ అండ్ లెగసీ ఎల్ఎల్పీ సంస్థల ప్రతినిధులు హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సంస్థల వ్యాపార అభివృద్ధికి అవసరమైన సహకారం, మార్గదర్శకత్వం అందించాలని కోరారు.ఈ సమావేశంలో ఆ సంస్థల వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ కాండూరి అభినయ్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కాండూరి లక్ష్మీనారాయణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గాదే శివచౌదరి, ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సంస్థల ప్రస్తుత వ్యాపార కార్యకలాపాలు, భవిష్యత్తు ప్రణాళికలు, నూతన వ్యాపార అవకాశాలు, అభివృద్ధి లక్ష్యాలపై చర్చించారు. యువ పారిశ్రామికవేత్తలను, నూతన ఆవిష్కరణలను, సాంకేతిక రంగంలో ఎదుగుతున్న సంస్థలను ప్రోత్సహించడం ద్వారా ఉపాధి అవకాశాలను విస్తరించవచ్చని అభిప్రాయపడ్డారు.భవిష్యత్తులో తమ సంస్థలను మరింత విస్తరించి, ఉపాధి కల్పనతోపాటు సమాజ అభివృద్ధికి కూడా కృషి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కాండూరి అభినయ్ తెలిపారు.



కూకట్‌పల్లి కాంగ్రెస్‌లో కుట్రలు సహించేది లేదు

బండి రమేశ్‌పై అసత్య ప్రచారాలను ఖండించిన గుండమల్ల రాజేందర్ కుమార్



ముద్ర, కూకట్‌పల్లి : కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కార్పొరేషన్ చైర్మన్ బండి రమేశ్ మరియు మాజీ మున్సిపల్ చైర్మన్ లక్ష్మణ్ మల్లిగారిలను లక్ష్యంగా చేసుకుని కొందరు చేస్తున్న అసత్య ప్రచారాలను, స్వార్థ రాజకీయాలను తీవ్రంగా ఖండిస్తున్నామని కూకట్‌పల్లి కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గుండమల్ల రాజేందర్ కుమార్ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బండి రమేశ్‌పై కుల ముద్ర వేస్తూ చేస్తున్న విమర్శల్లో ఎలాంటి నిజం లేదని తేల్చి చెప్పారు. పార్టీ కమిటీల్లో గానీ, డివిజన్లలో గానీ ఆయన ఎప్పుడూ తన స్వకులస్తులకు ప్రాధాన్యత ఇవ్వలేదని, మొదటినుంచీ బిసి (BC), ఎస్సి (SC) సామాజిక వర్గాలకే పెద్దపీట వేశారని వెల్లడించారు. ఎస్సీ (మాల) సామాజిక వర్గానికి చెందిన తనకు సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా బాధ్యతలు అప్పగించడమే ఆయన అందిస్తున్న ప్రాధాన్యతకు మరియు నిష్పాక్షికతకు నిదర్శనమని గుర్తు చేశారు.2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూకట్‌పల్లిలో కొంత మంది స్థానిక కాంగ్రెస్ నాయకుల నుంచి సహకారం లభించినప్పటికీ బండి రమేశ్ 65,000 పైచిలుకు ఓట్లు సాధించారని చెప్పారు. గతంలో పోటీ చేసి ఓడిపోయిన నాయకులు ఎన్నికల తర్వాత నియోజకవర్గాన్ని వదిలేసి వెళ్లిపోయిన దాఖలాలు ఉన్నాయని, కానీ బండి రమేశ్ మాత్రం ఓటమికి కుంగిపోకుండా నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని ప్రశంసించారు.బండి రమేశ్ నాయకత్వ పటిమ, అర్హతలను గుర్తించే ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆయనను టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా నియమించారని తెలిపారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, అధిష్టానానికి అత్యంత నమ్మకస్తుడిగా ఉంటూ పార్టీ బలోపేతానికి పనిచేస్తున్నారని చెప్పారు.పార్టీ అభివృద్ధి మరియు నియోజకవర్గ సంక్షేమం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాల్సింది పోయి, కొందరు వ్యక్తులు గ్రూపులుగా ఏర్పడి వ్యక్తిగత స్వార్థంతో ఆయనను టార్గెట్ చేయడం సరికాదని హెచ్చరించారు. బండి రమేశ్‌ను లక్ష్యంగా చేసుకుని ఆడుతున్న కుట్రల ఆటలను తక్షణమే స్వస్తి పలకాలని, లేకపోతే సహించేది లేదని గుండమల్ల రాజేందర్ కుమార్ తీవ్రంగా హెచ్చరించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 11.11.2026
www.mudranews.in | @mudranews

పేగుల ఆరోగ్యం : సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

తరచుగా విరేచనాలు, మలవిసర్జనలో మార్పులు ఉంటే వైద్యులను సంప్రదించాలి. వయసు, కుటుంబ చరిత్ర, వ్యక్తిగత ప్రమాద కారకాలను బట్టి కొలనోస్కోపీ వంటి పరీక్షలపై వైద్యుల సలహా తీసుకోవాలి.



లక్ష మందితో మహా పాదయాత్ర

ముద్ర, కరీంనగర్ : భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు నితిన్ నబిన్ కరీంనగర్ పర్యటన ఖరారైంది. ఈనెల 18న కరీంనగర్ కు రానున్నారు. 'సర్' పేరిట రాజ్యాంగ సంస్థలపై విపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు నిర్వహించే పాదయాత్రకు హాజరై ప్రసంగించనున్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ తొలిసారి కరీంనగర్ రానున్న నేపథ్యంలో కనీవినీ ఎరగని రీతిలో ''మహా పాదయాత్ర'ను సక్సెస్ చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నిర్ణయించారు. అందులో భాగంగా కనీసం లక్ష మందితో కరీంనగర్ లో ''మహా పాదయాత్ర'' చేసేందుకు సిద్ధమయ్యారు. గాంధీ సర్కిల్, వైశ్యా భవన్ నుండి టవర్ సర్కిల్ మీదుగా కమాన్ దాకా నిర్వహించే ఈ ''మహా పాదయాత్ర''లో లక్ష మందితో కలిసి నితిన్ నబిన్, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు, బండి సంజయ్ అడుగులో అడుగు వేయనున్నారు. ఈ నేపథ్యంలో ''మహా పాదయాత్ర'' ఏర్పాట్లపై చర్చించేందుకు ఈరోజు ఎంపీ కార్యాలయంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కోర్ కమిటీ నేతలతో కేంద్ర మంత్రి బండి సంజయ్ సమావేశమయ్యారు. కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు సాయిని మల్లేశం, రెడ్డబోయిన గోపీ, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ, గంగాడి క్రిష్ణారెడ్డి, సీనియర్ నేతలు కోమల అంజనేయులు, నల్లాల ఓదేలు, మోహన్ రెడ్డి, బోయినిపల్లి ప్రవీణ్ రావు, గుజ్జ శ్రీను, కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, కోహెడ వెంకన్న, తిరుపతిరెడ్డి తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ నితిన్ నబిన్ తొలిసారి కరీంనగర్ వస్తున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా కరీంనగర్ పేరు మారుమోగేలా ''మహా పాదయాత్ర''ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 'సర్' పై కాంగ్రెస్, ఇండీ కూటమి పేరుతో విపక్షాలు లేనిపోని దుష్ప్రచారం చేస్తూ ఎన్నికల సంఘాన్ని నీరుగార్చే కుట్రలతో రాజ్యాంగ సంస్థలపై దాడి చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంలో వాస్తవాలను ప్రజలకు తెలియజేసేందుకే నితిన్ నబిన్ కరీంనగర్ వస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో నిర్వహిస్తున్న ''మహా పాదయాత్ర''





ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని కనీసం లక్ష మంది ఈ యాత్రకు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. పార్టీ కార్యకర్తలు, ప్రజలు కూడా హాజరుకానున్న నేపథ్యంలో పోలింగ్ బూత్ కేంద్రాల నుండి శక్తి కేంద్రాలు, మండలాల వారీగా సమావేశాలు నిర్వహించాలని కోరారు. మీడియా, సోషల్ మీడియా ద్వారా మహా పాదయాత్రపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.

జెన్‌కోకు రోజుకు 75 వేల టన్నుల బొగ్గు సరఫరా

ముద్ర, హైదరాబాద్: తెలంగాణలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని జెన్ కో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు రోజుకు 75 వేల టన్నుల బొగ్గు సరఫరా చేయాలని సింగరేణి నిర్ణయించింది. ఒడిశాలోని నైనీ గని నుంచి యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి రోజుకు 16 వేల టన్నుల బొగ్గు తరలించనుంది. ఈ నెలాఖరు నుంచి ఈ సరఫరా ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. సింగరేణి సీఎండీ బుద్ధప్రకాష్ జ్యోతి, జెన్ కో సీఎండీ హరీష్ అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమన్వయ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణ జెన్ కోకే బొగ్గు సరఫరాలో మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని సింగరేణి సీఎండీ అధికారులను ఆదేశించారు. నైనీ గనిలో ప్రస్తుతం రోజుకు 20 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో భవిష్యత్తులో విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశం ఉండటంతో బొగ్గు సరఫరాను మరింత పెంచాలని సమావేశంలో నిర్ణయించారు.

ఐవీఎఫ్ కేంద్రాల అక్రమాలపై పోలీసుల ఉక్కుపాదం

ముద్ర, హైదరాబాద్: హైదరాబాద్‌లో ఐవీఎఫ్ (IVF) కేంద్రాల అక్రమాలపై మల్కాజిగిరి పోలీసులు దూకుడు పెంచారు. ఉద్యోగాల పేరుతో నగరానికి వచ్చిన యువతులను ట్రాప్ చేసి, వారి నుంచి అనుమతులు లేకుండా అండాలను సేకరిస్తున్నట్లు గుర్తించారు. వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల ముసుగులో కొన్ని కేంద్రాలు ఈ అక్రమ దందాలకు పాల్పడుతున్నట్లు అనుమానిస్తున్నారు. యువతుల ఆధార్ వివరాలను మార్చి నకిలీ కార్డులు సృష్టించి ఏఆర్టీ కేంద్రాలకు తప్పుడు సమాచారం అందిస్తున్న ప్రవీణ్‌ను బేగంపేట పోలీసులు అరెస్టు చేశారు. ఈ వ్యవహారంలో హైదరాబాద్, గుజరాత్‌కు చెందిన ముఠాల పాత్ర ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు అనుమానిస్తున్న 20 ఫెర్టిలిటీ కేంద్రాలకు అధికారులు నోటీసులు జారీ చేశారు. ఒక్కో యువతి నుంచి పదేపదే అండాలను సేకరించి వారి ఆరోగ్యానికి హాని కలిగిస్తున్నారన్న ఆరోపణలపై అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

పేద విద్యార్థికి అధ్యాపకుల ఆర్థిక సహాయం...



ముద్ర చిగురుమామిడి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రేకొండ గ్రామానికి చెందిన బొడ్డు అంజలి ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది.ఇటీవల అంజలి తండ్రి బొడ్డు కొమురయ్య తీవ్ర అనారోగ్యానికి గురై అకాల మరణం చెందారు,విద్యార్థిని కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని కళాశాల ప్రిన్సిపాల్ శశిధర్ శర్మ,అధ్యాపకులు మంగళవారం రేకొండలోని విద్యార్థిని ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించి,ఆరువేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అంజలి ఇంటర్మీడియట్ విద్య పూర్తి చేసే వరకు అమ్మాయికి కావాల్సిన అన్ని రకాల పాఠ్యపుస్తకాలను,పరీక్ష ఫీజులను కళాశాల సిబ్బంది బరిస్తుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శశిధర్ శర్మ,అధ్యాపకులు జనార్దన్, రవికుమార్, గోవర్ధన్ రెడ్డి, మహేందర్, చంద్రశేఖర్, మమత, స్వరూప, కవిత పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

*** కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం..**
*** 7గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం...**



ముద్ర చిగురుమామిడి: రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని,కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, చిగురుమామిడి సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్ స్పష్టం చేశారు.మంగళవారం మండలంలోని సీతారాంపూర్, రేకొండ, బొమ్మనపల్లి, నవాబుపేట, ఉల్లంపల్లి, రామంచ, ముల్కనూర్ తదితర గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారికంగా వారు ప్రారంభించారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్ ముఖ్య అతిథులుగా పాల్గొని కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కేంద్రాల వద్ద తాగునీరు, నీడ, తార్పాలిన్లు వంటి అవసరమైన అన్ని వసతులను కల్పించినట్లు పేర్కొన్నారు.బొమ్మనపల్లి,ఉల్లంపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాల్లో సర్పంచులు గోగూరి లక్ష్మి మురహరి రెడ్డి, కొంకట మౌనిక,గూళ్ళ రజిత రాజు,ఒంటెల కిషన్ రెడ్డి,అలువాల శంకర్,సాంబారి భారతమ్మ కొమురయ్య,ఐకెపి ఎపిఎం రజిత,కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బడుకోలు దేవేందర్ రెడ్డి,సాంబారి బాబు,ఉపసర్పంచులు ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి,కాసర్ల హరీష్, బిల్లా సంతోష్ రెడ్డి,శ్రీనివాస్, పైడిపల్లి వెంకటేష్ గౌడ్,సింగిల్ విండో డైరెక్టర్లు పోటు మల్లారెడ్డి, కుతాటి తిరుపతి,పిల్లి కొమరయ్య,చాడ మహిపాల్ రెడ్డి,మర్రి శ్రీనివాస్,రేకొండ డీసీఎంఎస్ నిర్వాకుడు దొడ్ల తిరుపతిరెడ్డిలతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు,ఆయా గ్రామాల రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కొండగట్టు అంజన్నను దర్శించుకున్న
సినీ నటుడు శ్రీకాంత్



ముద్ర, జగిత్యాల : ప్రముఖ సినీ నటుడు శ్రీకాంత్ మంగళవారం కొండగట్టు ఆంజనేయస్వామి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, అధికారులు ఆయనకు స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి శేషవస్త్రంతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు ఆయనతో సెల్ఫీ ఫోటోలు దిగడానికి ఆసక్తి కనబరిచారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్..
పది బైకులు స్వాధీనం



ముద్ర, ధర్మారం: పెద్దపల్లి, జగిత్యాల, కరీంనగర్, నిర్మల్, కామారెడ్డి తదితర జిల్లాలో బైకులు దొంగిలిస్తున్న దొంగను ధర్మారం పోలీసులు పట్టుకున్నారు. పెద్దపల్లి ఎసీపీ జి. కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కోరుట్లలోని ఏసుమణి గుట్ట ప్రాంతానికి చెందిన కండ్లే బాపన్న భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేసేవాడు. సరైన ఆదాయం లేక 2016 నుంచి ద్విచక్ర వాహనాలను దొంగిలించడం అలవాటుగా చేసుకున్నాడు. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలం గంపలపల్లిలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. తాను బైక్ మెకానిక్ గా పనిచేస్తున్నాని చెప్పేవాడు. వివిధ ప్రాంతాల్లో దొంగిలించిన ద్విచక్ర వాహనాలను అక్కడికి తీసుకువచ్చి ఉంచేవాడు. పదికి పైగా వాహనాలు పోగయ్యాక ఒకేసారి మహారాష్ట్రకు తరలించి విక్రయించే వాడు. ఇటీవల ధర్మారం మండలం నందిమేడారానికి చెందిన పడిదం రాజయ్య ద్విచక్ర వాహనం ధర్మారం బస్టాండ్‌లో నిలపగా చోరీకి గురయింది. రాజయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వాహనంపై వెళ్తూ నిందితుడు కండ్లే బాపన్న పోలీసులకు చిక్కాడు. విచారించగా అతను దొంగగా తేలింది. అతని వద్ద వివిధ ప్రాంతాలలో దొంగిలించిన పది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏసీపీ వివరించారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్, ధర్మారం ఎస్సై శ్రీకాంత్‌లను ఏసీపీ అభినందించారు. హెడ్ కానిస్టేబుళ్లు రమేష్, మోషీన్ పాషా, కానిస్టేబుళ్లు తిరుపతి, శిరీష్, సతీష్‌లను ఏసీపీ రివార్డులు అందించారు.

తండ్రీకూతుళ్ల పార్థివ దేహాలకు నివాళులర్పించిన మంత్రి పొన్నం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాన్ని పరామర్శించి,ప్రగాఢ సానుభూతి తెలిపిన మంత్రి..
ప్రభుత్వం తరపున అండగా ఉంటామని భరోసా

ముద్ర చిగురుమామిడి: సిద్దిపేట – హుస్నాబాద్ ప్రధాన రహదారిపై హుస్నాబాద్ మండలం పందిళ్ల శివారులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది.ఈ ప్రమాదంలో కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన పైడిపల్లి శ్రీకాంత్ (33), ఆయన తొమ్మిదేళ్ల కుమార్తె మహాన్వి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.మంగళవారం మృతుల స్వగ్రామమైన కొండాపూర్‌కు చేరుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్, శ్రీకాంత్, మహాన్వి‌ల పార్థివ దేహాలకు పూలమాలలు వేసి అశ్రునయనాలతో నివాళులర్పించారు.ఒకే కుటుంబంలో యాజమానితో పాటు చిన్నారి కూతురు కూడా రోడ్డు ప్రమాద మహమ్మారికి బలికావడం అత్యంత హృదయవిదారకమని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులను, బంధువులను కలిసి మంత్రి ఓదార్చారు.వారిని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.గుండెకోతతో ఉన్న కుటుంబ సభ్యులకు ధైర్యం



చెబుతూ ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని,అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్,సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు మార్క రాజ్ కుమార్ గౌడ్,నాయకులు వంగర మల్లేశం,ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి, బింగి రాజేంద్రప్రసాద్,స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులుగ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మృతులకు నివాళులర్పించారు.

కరువు వేళ రైతులకు బ్యాంకులు అండగా నిలవాలి

పంట రుణాల రీషెడ్యూలింగ్‌తో పాటు రబీకి కొత్త రుణాలు ఇవ్వాలి: భట్టి, తుమ్మల

ముద్ర, హైదరాబాద్ : రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు బ్యాంకులు ప్రత్యేక చొరవ చూపాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. కరువు ప్రభావిత ప్రాంతాల్లో అర్హులైన రైతుల పంట రుణాలను ఆర్బీఐ నిబంధనల ప్రకారం రీషెడ్యూలింగ్, రీస్ట్రక్చరింగ్ చేయడంతో పాటు రబీ సీజన్‌కు కొత్త రుణాలను సకాలంలో మంజూరు చేయాలని సూచించారు. హైదరాబాద్ ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్‌ఎల్‌బీసీ) సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 365 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించామని, వీటిలో 111 మండలాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని తెలిపారు. వర్షాభావంతో రైతుల పెట్టుబడులు, ఆదాయాలు దెబ్బతిన్నాయని, చిన్న, సన్నకారు, కౌలు రైతులకు రుణాల మంజూరులో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. రబీ సీజన్‌కు నిర్దేశించిన రూ.38,268 కోట్ల పంట రుణాలను వెంటనే అందించాలని తుమ్మల సూచించారు.

రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గడం, భూగర్భ జలాలు అడుగంటడంతో సుమారు 10 నుంచి 15 లక్షల బోరుబావుల్లో నీటి కొరత ఏర్పడిందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. డ్రిప్, స్ప్రింక్లర్



సాగుతో పాటు పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఉద్యాన పంటల సాగుకు రుణాలు అందించాలని కోరారు. పాడి పరిశ్రమ, పౌల్ట్రీ, పశుపోషణ వంటి అనుబంధ రంగాలను ప్రోత్సహించడం ద్వారా రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు కల్పించవచ్చన్నారు.

మరోవైపు విద్యా, గృహ రుణాల మంజూరుతో పాటు ఎంఎస్ఎంఈ, మౌలిక సదుపాయాల రంగాలకు రుణాలను పెంచాలని భట్టి విక్రమార్క బ్యాంకర్లకు సూచించారు. మహిళా స్వయం సహాయక సంఘాలు, నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి రుణాలు అందించాలని కోరారు. ప్రస్తుత కరువు పరిస్థితులను ప్రభుత్వం, బ్యాంకులు సమష్టిగా ఎదుర్కొని రైతులకు భరోసా కల్పించాలని ఇరువురు నేతలు పిలుపునిచ్చారు.

జీఎస్ఐటీఐలో మూడు కీలక మౌలిక వసతులు ప్రారంభం

రూ.9.12 కోట్లతో అంతర్జాతీయ వసతి గృహం, జియోఫిజికల్ ల్యాబ్, డిజిటల్ స్టూడియో ఏర్పాటు

ముద్ర, హైదరాబాద్: హైదరాబాద్ బండ్లగూడ–నాగోల్‌లోని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా శిక్షణ సంస్థ (జీఎస్ఐటీఐ)లో రూ.9.12 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన మూడు కీలక మౌలిక వసతులను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మంగళవారం ప్రారంభించారు. అంతర్జాతీయ వసతి గృహం, అధునాతన జియోఫిజికల్ డేటా ప్రాసెసింగ్ ల్యాబొరేటరీ, డిజిటల్ స్టూడియోలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో ఖనిజ, మైనింగ్ రంగం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. దేశ ఖనిజ భద్రతను బలోపేతం చేసేందుకు కీలక ఖనిజాలు, అరుదైన మూలకాల అన్వేషణను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించేలా దేశీయ ఖనిజ నిక్షేపాల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పరిశోధనలు చేపట్టాలని సూచించారు.

ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. శాస్త్రీయ పరిశోధనలు,



సాంకేతిక అభివృద్ధితోనే వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోగలమన్నారు. ఖనిజ వనరులను సమర్థంగా అన్వేషించి వినియోగించుకోవాలని, పరిశోధకులు దేశ అభివృద్ధికి మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు.కొత్తగా ఏర్పాటు చేసిన అంతర్జాతీయ వసతి గృహాన్ని రూ.4.27 కోట్లతో నిర్మించగా, ఇందులో 32 అధునిక సూట్లతో పాటు భోజనశాల, వ్యాయామశాల, మినీ లైబ్రరీ తదితర సదుపాయాలు కల్పించారు. రూ.4.55 కోట్లతో ఏర్పాటు చేసిన జియోఫిజికల్ ల్యాబొరేటరీలో 25 అత్యాధునిక కంప్యూటర్లు, ప్రత్యేక సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి తెచ్చారు. మరో రూ.30 లక్షలతో నిర్మించిన డిజిటల్ స్టూడియో ద్వారా శిక్షణ వీడియోలు, పాడ్‌క్యాస్ట్‌లు, వెబినార్లు రూపొందించనున్నారు.

ఈ కార్యక్రమంలో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ దినేశ్ వీ. గన్వీర్, గనుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి ఫరీదా ఎం. నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సదుపాయాలు భూవిజ్ఞాన పరిశోధనలు, ఖనిజ అన్వేషణ, అంతర్జాతీయ శిక్షణకు మరింత దోహదపడనున్నాయి.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 11.11.2026
www.mudranews.in | @mudranews

నీళ్లతోనే జీర్ణవ్యవస్థకు బలం

రోజంతా తగినంత నీరు, ద్రవాలు తీసుకోవాలి. ముఖ్యంగా పీచు పదార్థాలతో పాటు నీరు తీసుకుంటే మలబద్ధకం సమస్య దూరమవుతుంది.



స్వర్ణగిరిలో కార్తీక మాసోత్సవాలు ప్రారంభం





ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన స్వర్ణగిరిలో కార్తీక మాసోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజు ఉదయం ఆలయంలోని అష్టలక్ష్మి మంటపంలో కార్తీక దామోదర హవనము నిర్వహిస్తారు. అనంతరం వైభవ మంటపంలో సత్య నారాయణ వ్రతం జరుగుతుంది. సాయంత్రం సంధ్య వేళ ఆలయ ధ్వజస్తంభమునకు మోక్ష నారాయణ దీపాన్ని వెలిగిస్తారు. ఈ నెల 21 వ తేదీన కార్తీక ద్వాదశిని పురస్కరించుకొని తులసి దామోదర కళ్యాణం నిర్వహిస్తారు. అలాగే ఈ నెల 24 వ తేదీన కార్తీక పౌర్ణమి సందర్భంగా వేదం పుష్కరిణి తీరంలో జల నారాయణ స్వామి వారి సన్నిధిలో కోటి దీపోత్సవం, శ్రీవారికి గరుడ సేవ మరియు జ్వాలా తోరణం కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

- ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి

రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం
ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : రైతులకు అండగా, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని కాటేపల్లి గ్రామం, చాడ, కొండాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను, ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కొండాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను, వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూరైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులు పండించిన ప్రతి గింజకు మద్దతు ధర కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరను పొందాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సౌకర్యాలు, సురక్షితమైన తాగునీరు, నాణ్యమైన రహదారులు అందించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాల పెంపునకు నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, వార్డు మెంబర్లు, పాల్గొన్నారు.

భూనిర్వాసితులకు పరిహారం అందించాలి

కలెక్టర్ ప్రతిమ సింగ్ ఆదేశం



ముద్ర ప్రతినిధి, మెదక్: రోడ్ల నిర్మాణంలో భూములు కోల్పోతున్న బాధితులకు పరిహారం అందించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి జాతీయ రహదారుల అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... రామాయంపేట నుంచి సిద్దిపేట పరిధిలో 765డి, 765డిజి రోడ్ల నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులు, భూ యజమానులకు ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారం తగిన నష్టపరిహారం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు.రోడ్ల నిర్మాణం కోసం చేపడుతున్న భూసేకరణ ప్రక్రియలో బాధితులకు ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని, భూముల సర్వే, రికార్డుల పరిశీలనను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాలు, తూప్రాన్ మండలంలో రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం నిబంధనల ప్రకారం న్యాయమైన పరిహారం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సంక్షేమ వసతి గృహాలపై ప్రత్యేక శ్రద్ధసంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో మండల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన సంక్షేమ వసతి గృహాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. హాస్టళ్లలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, వసతి సౌకర్యాలు, పారిశుద్ధ్యం, విద్యుత్, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలను తరచుగా తనిఖీ చేయాలని ఆదేశించారు.విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతి గృహాల్లో నిరంతర తాగునీటి సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఉన్నట్లయితే వెంటనే గుర్తించి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి బోర్లు వేయాల్సిన అవసరం ఉన్న వసతి గృహాలకు సంబంధించి సంబంధిత అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి వెంటనే పంపించాలని ఆదేశించారు.విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అధికారులు తరచుగా హాస్టళ్లను సందర్శించి, సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని సూచించారు.రేపటి నుంచి ఎల్ నినోను సమర్థవంత ఎదుర్కోవడానికి రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహనతో కూడిన గ్రామసభలు నిర్వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ శ్రీనివాసరావు, జిల్లా విద్యాధికారి రాజు, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.జాబితాలో పేరు గల్లంతైన అర్హులైన ఓటర్లకు మరో అవకాశంప్రత్యేక ఓటరు జాబితా సవరణ–2026లో భాగంగా గైర్హాజరు, వలస వెళ్లిన, మరణించిన డూప్లికేట్గా గుర్తించి, ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు చేర్చని అర్హులైన ఓటర్లకు భారత ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు.మెదక్ పట్టణంలోని దాయరలో ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారుఓటర్లు తమ వివరాలతో కూడిన ఎలక్టోరల్ ఫారాలను తిరిగి పూరించి, సంబంధిత బిఎల్ఓకు సమర్పించాలన్నారు.గైర్హాజరు, వలస, మరణం, డూప్లికేట్గా గుర్తించినప్పటికీ ఎలక్టోరల్ ఫారాలు అందని ఓటర్ల బూత్‌వారీ జాబితాలను సంబంధిత పోలింగ్ కేంద్రాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, పట్టణ స్థానిక సంస్థల కార్యాలయాలు, ఇతర ముఖ్యమైన బహిరంగ ప్రదేశాల్లో మరోసారి ప్రదర్శించడం జరుగుతుందన్నారు. వెంట మెదక్ ఆర్డీఓ రమాదేవి, తహసిల్దార్ లక్ష్మణ్ బాబు, బిఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై ధాన్యం ఆరబెట్టొద్దు

ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు



ముద్ర ప్రతినిధి, మెదక్: రహదారులపై వరి ధాన్యం ఆరబెట్టడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయనిఎస్పీ డి.వీ. శ్రీనివాసరావు పేర్కొన్నారు. కొంతమంది రైతులు ధాన్యాన్ని రహదారులపై ఆరబెట్టడం వల్ల వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడమే కాకుండా వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని సూచించారు. ధాన్యం చుట్టూ రాళ్లు పెట్టడం, నల్లటి పాలిథిన్ కవర్లతో కప్పడం వల్ల ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనదారులు వాటిని గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయని వెల్లడించారు. రైతులు రహదారులను వినియోగించకుండా గ్రామ పంచాయతీ ప్రాంగణాలు, ఖాళీ స్థలాలు లేదా రహదారులకు దూరంగా ఉన్న సురక్షిత ప్రదేశాల్లో ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని సూచించారు.చిన్నపాటి నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని, రైతులు తమ భద్రతతో పాటు ఇతరుల ప్రాణాల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రమాదాల నివారణకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.

పాగమంచులో ప్రయాణం చేసేప్పుడు జాగ్రత్త

చలి తీవ్రత పెరుగుతోంది..
అప్రమత్తతే ప్రాణరక్షణ
వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి
రోడ్డు ప్రమాదాల నివారణకు భద్రతా నియమాలు పాటించాలి
ఎస్పీ కె. నరసింహ



ముద్ర, సూర్యాపేట: జిల్లాలో చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కె. నరసింహ, ఐపీఎస్ సూచించారు. తెల్లవారుజామున, రాత్రి వేళల్లో పొగమంచు అధికంగా ఉండటంతో రహదారులు, ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో వాహనదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.పొగమంచు ఎక్కువగా ఉన్న సమయంలో అత్యవసరమైతే తప్ప ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించారు. తప్పనిసరిగా ప్రయాణించాల్సి వస్తే వాహనాలను నెమ్మదిగా నడుపుతూ నిర్ణీత వేగ పరిమితులను పాటించాలన్నారు. వాహనాల హెడ్‌లైట్లు, ఫాగ్‌లైట్లను అవసరానికి అనుగుణంగా ఉపయోగించాలని, ముందు వెళ్తున్న వాహనానికి తగినంత దూరం పాటించాలని తెలిపారు. ఆకస్మికంగా బ్రేకులు వేయడం, ప్రమాదకరంగా వాహనాలను ఓవర్‌టేక్ చేయడం చేయరాదని స్పష్టం చేశారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్లు ఉపయోగించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.పిల్లలు, వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరంచలి తీవ్రత కారణంగా పిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉన్నందున కుటుంబ సభ్యులు వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎస్పీ సూచించారు. చలి నుంచి రక్షణ కోసం ఉన్ని దుస్తులు, స్వెటర్లు, టోపీలు ధరించేలా చూడాలన్నారు.ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ పోలీసుల సూచనలు, రహదారి భద్రతా నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని, తమ ప్రయాణాలను సురక్షితంగా కొనసాగించాలని ఎస్పీ కె. నరసింహ విజ్ఞప్తి చేశారు.

పట్టణాన్ని పారిశుద్ధ్యంగా ఉంచాలి

మునిసిపల్ కమిషనర్ కి వినతిపత్రం సమర్పించిన మున్సిపల్ కౌన్సిలర్లు



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : భువనగిరి పురపాలక సంఘం పరిధిలోని కమర్షియల్ ఏరియాలలో ప్రైవేటీకరణ ద్వారా చెత్త సేకరించి పట్టణాన్ని పారిశుద్ధ్యంగా ఉంచే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ కి మున్సిపల్ కౌన్సిలర్లు వినతిపత్రం సమర్పించారు.భువనగిరి చెరువు కట్ట నుండి రాయగిరి కామన్ వరకు గల ప్రధాన రహదారిపై రెండు దిక్కుల ఉన్న దుకాణాల నుండి ప్రత ప్రతిరోజు చెత్త ప్రైవేటు ఆటోల ద్వారా లేదా ట్రాక్టర్ల ద్వారా చెత్త సేకరించడం వల్ల సిబ్బంది కొరత తీరుతుందని వారు అన్నారు. మెయిన్ రోడ్డుపై సిబ్బంది లేని కారణంగా వార్డుల్లో ఉన్న సిబ్బందిని తీసుకువెళ్లి మెయిన్ రోడ్డు ట్రాక్టర్లపై వేయడం వల్ల వార్డులో పారిశుద్ధ్యం కుంటుపడుతుందని తెలిపారు. అంశాన్ని వచ్చే కౌన్సిల్ సమావేశంలో పొందుపరిచి తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు.18, 30, 14, 31వ వార్డు కౌన్సిలర్ లు పాశం అమర్నాథ్, ఎండీ.లయిక్ అహ్మద్, తుమ్మేటి పాండు, సుమయ్య తబస్సుమ్ షఫీక్ అహ్మద్ ఉన్నారు.

బ్రహ్మేంద్రస్వామి విగ్రహం తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి

విశ్వకర్మ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన



ముద్ర ప్రతినిధి, మెదక్: నర్సాపూర్ పట్టణంలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం తొలగించడాన్ని నిరసిస్తూ మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో విశ్వకర్మ జేఏసీ ఆధ్వర్యంలో సభ్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. విగ్రహం తొలగించి అవతల పారేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో జేఏసీ సభ్యులు పూనా రవి చారి, జేఎల్ శ్రీనివాస్ చారి, రాచపల్లి శ్రీనివాస్, ఇటిక్యాల వేణు చారి, చదువుల రమేష్ చారి, పాండురంగ చారి, గాంధీనగర్ శ్రీనివాస్ చారి, నరసింహ చారి, సాయి బాబా చారి, నరసింహ చారి, బ్రహ్మాచారి, బలరాం చారి, బ్రహ్మం, సిద్ధిరాములు చారి, నాగరాచారి, శ్రీహరి, రవి, సభ్యులు పాల్గొన్నారు.

పాండురంగారెడ్డి సేవలు అభినందనీయం



ముద్ర, పటాన్‌చెరు : సాండ్విక్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడిగా, సీఐటీయూ రాష్ట్ర నాయకుడిగా పి. పాండురంగారెడ్డి కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, ఐక్యత కోసం చేసిన సేవలు అభినందనీయమని పలువురు నాయకులు కొనియాడారు.ఈ సందర్భంగా సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు కామ్రేడ్ పాతిని కృష్ణమూర్తి మాస్టర్ పాండురంగారెడ్డిని కలిసి, కార్మికుల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆయన సాగించిన పోరాటం, నిబద్ధత, నాయకత్వ లక్షణాలు సహచర కార్మికులకు, యువ నాయకులకు స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. అనంతరం శాలువా కప్పి ఘనంగా సన్మానించి, పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కామ్రేడ్ శ్రీనివాస రెడ్డి, భాస్కర్, నరేంద్ర వర్మ పాల్గొని అభినందనలు తెలియజేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 11.11.2026
www.mudranews.in | @mudranews

పీచు పదార్థాలే ప్రాణం

పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాలు రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలి. ఇవి జీర్ణక్రియను మెరుగుపరిచి మలబద్ధకాన్ని నివారిస్తాయి.



మహిళల భద్రతకు భరోసా కేంద్రం అండ





సైబరాబాద్‌లో నూతన భరోసా కేంద్రం ప్రారంభం

వైద్య, న్యాయ, మానసిక కౌన్సెలింగ్ సేవలు ఒకే చోట

డీజీపీ సీవీ ఆనంద్

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి నవంబర్ 26 నుంచి 'సైబరాబాద్ మూవ్స్' సమావేశాలు

ముద్ర, హైదరాబాద్, నవంబర్ 10: మహిళలు, బాలికల భద్రతకు మరింత భరోసా కల్పించే లక్ష్యంతో సైబరాబాద్‌లో నూతనంగా నిర్మించిన భరోసా కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. మహిళలపై లైంగిక దాడులు, ఇతర నేరాలకు గురైన బాధితులకు వైద్య పరీక్షలు, మానసిక కౌన్సెలింగ్, న్యాయ సహాయం వంటి సేవలను ఒకే వేదికపై అందించడమే ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశమని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. భరోసా కేంద్రం నిర్మాణం పూర్తికావడానికి ఏడేళ్ల సమయం పట్టిందని, సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఇది అందుబాటులోకి రావడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. దేశంలోనే ప్రత్యేకమైన విధానంలో భరోసా కేంద్రాలు పనిచేస్తున్నాయని వివరించారు. బాధిత మహిళలకు పోలీసు సహాయంతో పాటు మానసిక వేదన నుంచి కోలుకునేందుకు కౌన్సెలింగ్ అందించడం ఈ వ్యవస్థ ప్రత్యేకత అని చెప్పారు. వైద్య, న్యాయ సహాయాన్ని ఒకే చోట అందించడం వల్ల దర్యాప్తు, న్యాయ ప్రక్రియ మరింత సమర్థంగా సాగుతున్నాయని తెలిపారు. హైదరాబాద్‌లో ప్రత్యేక పోక్సో కోర్టు ఏర్పాటు కూడా నేరస్తులకు శిక్షలు పడే అవకాశాలను పెంచేందుకు దోహదపడుతోందన్నారు.మహిళల భద్రతలో సంస్థల భాగస్వామ్యంసైబరాబాద్ పరిధిలో మహిళల భద్రతకు సెక్యూరిటీ కౌన్సిల్ ఫర్ సైబరాబాద్ (ఎస్‌సీఎస్‌సీ) అందిస్తున్న సహకారాన్ని డీజీపీ అభినందించారు. భరోసా కేంద్రం నిర్మాణానికి రహేజా డైరెక్టర్ శ్రావణ్ ఆర్థిక సహకారం అందించడం ప్రశంసనీయమన్నారు. గతంలోనూ మహిళల భద్రతకు సంబంధించిన పలు కార్యక్రమాలకు ఎస్‌సీఎస్‌సీ మద్దతుగా నిలిచిందని గుర్తుచేశారు.2013 మేలో జరిగిన రెండు అత్యాచార ఘటనలను ప్రస్తావిస్తూ, అప్పట్లో చిన్న ఆధారంతోనే దర్యాప్తులో కీలక పురోగతి సాధించిన విషయాన్ని వివరించారు. వాటిలో ఒకటి అభయ కేసుగా గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. మహిళల భద్రత కోసం ఐటీ సంస్థలు సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ట్రాఫిక్ సమస్యకు విరుగుడు పరిష్కారాలుసైబరాబాద్‌లో పెరుగుతున్న వాహనాల సంఖ్యతో ట్రాఫిక్ సమస్య తీవ్రతరమవుతోందని డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. ముఖ్యంగా ఐటీ సంస్థలు, ఆసుపత్రులు ఉన్న ప్రాంతాల్లో రద్దీ సమయాల్లో వాహనాల రాకపోకలు ఇబ్బందికరంగా మారుతున్నాయని చెప్పారు. ఈ సమస్యకు ఆచరణాత్మక పరిష్కారాలు కనుగొనేందుకు నవంబర్ 26 నుంచి 28 వరకు మూడు రోజుల పాటు 'సైబరాబాద్ మూవ్స్' పేరిట ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు.ఐటీ కంపెనీలు, ఆసుపత్రులు, కార్పొరేట్ సంస్థలు, బస్సు రవాణా నిర్వాహకులు, ఎస్‌సీఎస్‌సీ ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్‌పూలింగ్, ప్రజా రవాణా వినియోగం, ఉద్యోగుల ప్రయాణ సమయాల నిర్వహణ వంటి అంశాలపై వినూత్న ప్రతిపాదనలు చేయాలని కోరారు. ట్రాఫిక్ నియంత్రణకు కొత్త ప్రయోగాలు చేసేందుకు పోలీసు శాఖ సిద్ధంగా ఉందని, ఆచరణాత్మక సూచనలకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ట్రాఫిక్ సమస్యపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగించాలని సూచించారు. పోలీసు పాఠశాల అభివృద్ధికి కార్పొరేట్ సంస్థలు సీఎస్‌ఆర్ నిధుల ద్వారా సహకరించాలని కోరారు.పోలీసు సేవల్లో సాంకేతికతకు ప్రాధాన్యంసైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ మాట్లాడుతూ 2013–16 మధ్య సైబరాబాద్ సీపీగా పనిచేసిన సీవీ ఆనంద్ వేసిన పునాదులపై ప్రస్తుతం సమర్థవంతమైన వ్యవస్థలు ఏర్పడ్డాయని తెలిపారు. మహిళల భద్రత కోసం ప్రవేశపెట్టిన షీ టీమ్స్, షీ షటిల్స్, సేఫ్ సిటీ ప్రాజెక్టులోని ఉమెన్ పెట్రోల్ వాహనాలు, టీ సేఫ్ యాప్ ఆపద సమయంలో మహిళలకు అండగా నిలుస్తున్నాయని చెప్పారు.పాస్‌పోర్టు వెరిఫికేషన్‌లోనూ సైబరాబాద్ కమిషనరేట్ దేశస్థాయిలో గుర్తింపు సాధించిందన్నారు. గతంలో 57 రోజులు పట్టే ప్రక్రియను 'వెరీ ఫాస్ట్' కార్యక్రమం ద్వారా ఎనిమిది రోజులకు తగ్గించినట్లు గుర్తుచేశారు. గత 14 ఏళ్లుగా పాస్‌పోర్టు వెరిఫికేషన్‌లో దేశంలోనే మొదటి స్థానంలో కొనసాగడం గర్వకారణమన్నారు.టీ–స్క్వార్క్, సీసీటీఎన్ఎస్, ఈ–సాక్ష్, ఐసీజేఎస్ వంటి సాంకేతిక వ్యవస్థల వినియోగంతో పోలీసు సేవలు, కేసుల దర్యాప్తు, నేరాల నియంత్రణలో పురోగతి సాధిస్తున్నామని తెలిపారు. గతంలో 22 శాతంగా ఉన్న కేసుల కన్విక్షన్ రేటు ప్రస్తుతం 42 శాతానికి పెరిగిందని వివరించారు.పోలీసుల సేవలు అభినందనీయంశేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడుతూ భరోసా కేంద్రం ప్రారంభం కావడం సంతోషకరమన్నారు. ఐటీ, సేవా రంగ సంస్థలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, కరోనా సమయంలో అవి అందించిన సహకారం మరువలేనిదని చెప్పారు. పోలీసు శాఖ సేవలు ప్రశంసనీయమని, ప్రజల్లో పోలీసుల పట్ల సానుకూల దృక్పథం పెరుగుతోందన్నారు.తమ ప్రాంతంలో ప్రధాన సమస్య ట్రాఫిక్ అని పేర్కొంటూ, ఎండను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులకు ఆరోగ్య పరీక్షలు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. శేరిలింగంపల్లి పరిధిలో భరోసా కేంద్రం ఏర్పాటు కావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీజీపీ సీవీ ఆనంద్, సైబరాబాద్ సీపీ రమేష్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఎస్‌సీఎస్‌సీ సంస్థల ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు 2.39 ఎకరాల భూమి బదిలీ

కలెక్టర్‌కు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కృతజ్ఞతలు



ముద్ర, కూకట్‌పల్లి :కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని కె పి హెచ్ బి డివిజన్, రమ్యా గ్రౌండ్ వద్ద ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి కేటాయించిన 2.39 ఎకరాల స్థలాన్ని ఎట్టకేలకు హౌసింగ్ బోర్డు నుంచి విద్యాశాఖకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి మంగళవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనూ చౌదరిని మర్యాదపూర్వకంగా కలసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.మూడు సంవత్సరాల క్రితం పాఠశాల నిర్మాణానికి పునాదులు వేసినప్పటికీ, తదనంతర పరిణామాలతో స్థలం బదిలీ ప్రక్రియ ఆలస్యమై నిర్మాణానికి ఆటంకం ఏర్పడింది. పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన ప్రభుత్వ విద్యను అందించాలనే లక్ష్యంతో స్థానిక ప్రజలు, కాలనీవాసుల మద్దతుతో ఎమ్మెల్యే కృష్ణారావు నిరంతరం చేసిన కృషి ఫలితంగా భూమి బదిలీ పూర్తయింది. ఈ సందర్భంగా పాఠశాల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్‌ను కోరారు.అలాగే, నియోజకవర్గంలోని పలు కాలనీల భూములు 22–ఏనిబంధనల పరిధిలో ఉండటం వల్ల విద్యార్థులు విద్యా రుణాలు, ప్రజలు ఇతర బ్యాంకు రుణాలు పొందలేక ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యను కూడా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు నాగేశ్వరరావు, కేపీహెచ్‌బీ డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు రూ.50 లక్షల విరాళం

దాతలు ముందుకు రావడం సంతోషం: డిజిపి సి.వి.ఆనంద్

పోలీసు కుటుంబాల పిల్లల విద్యాభివృద్ధికి చేయూత

ఆప్టిమస్ గ్రూప్ చైర్మన్ డి. శ్రీనివాసరెడ్డి



ముద్ర, శేరిలింగంపల్లి :యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో విద్యా మౌలిక వసతుల అభివృద్ధికి ఆప్టిమస్ గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ పార్ట్‌నర్ డాక్టర్ డి. శ్రీనివాసరెడ్డి రూ.50 లక్షల విరాళం అందించారు. మంగళవారం మైండ్ స్పేస్ లోని పెరల్ క్లబ్ లో నిర్వహించిన ఓపెన్ హౌస్ సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్‌కు విరాళం చెక్కును అందజేశారు.ఈ నిధులను పాఠశాలలో తరగతి గదులు, సైన్స్, టెక్నాలజీ ప్రయోగశాలలు, గ్రంథాలయం, క్రీడా వసతులు, డిజిటల్ విద్యా సదుపాయాల అభివృద్ధికి వినియోగించనున్నారు. పోలీసు సిబ్బంది పిల్లలతోపాటు సాధారణ ప్రజల కుటుంబాలకు చెందిన పిల్లలకు సైతం సమాన ప్రాతిపదికన నాణ్యమైన విద్యను అందించడమే ఈ పాఠశాల లక్ష్యం.విరాళం అందించిన డాక్టర్ శ్రీనివాసరెడ్డిని డీజీపీ సీవీ ఆనంద్ ఈ సందర్భంగా అభినందించారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో అత్యుత్తమ విద్యా ప్రమాణాలు నెలకొల్పేందుకు పారిశ్రామిక, వాణిజ్య సంస్థలు, దాతలు ముందుకొచ్చి సహకారం అందించాలని ఆయన సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, క్రీడలు, ఇతర రంగాల్లోనూ మెరుగైన అవకాశాలు కల్పించేలా పాఠశాలను అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. పోలీసులంటే తనకు ఎంతో గౌరవమని, సమాజ భద్రత కోసం వారు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. పోలీసు కుటుంబాల పిల్లల విద్యాభివృద్ధికి తన వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విద్య ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, ఎన్ఎన్‌సీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, ఐటీ రంగానికి చెందిన సంస్థలు, ఆర్టీసీ, ఇతర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో నిర్లక్ష్యం!





మట్టి రోడ్డే దిక్కు.. అధికారుల కోసం ప్రజల పడిగాపులు

విజిటింగ్ అవర్స్ అమలు ఏదీ? కలెక్టర్ విచారణ చేపట్టాలని ప్రజల డిమాండ్

ముద్ర, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వ కార్యాలయాలే వారికి ఇబ్బందులు కలిగిస్తే పరిస్థితి ఏమిటి? రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయ నిర్వహణపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. కార్యాలయానికి వెళ్లే రహదారి మట్టి రోడ్డుగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో బురద కారణంగా వృద్ధులు, మహిళలు, రైతులు కార్యాలయానికి చేరుకోవడం కష్టంగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మరోవైపు కార్యాలయ పరిసరాల పరిశుభ్రత, మౌలిక సదుపాయాల నిర్వహణ కూడా సక్రమంగా లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆర్డీవో ఎర్ర శ్రీనివాస్ రెడ్డి అందుబాటులో ఉండే సమయాలపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వివిధ రెవెన్యూ సమస్యలతో దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు అధికారి కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విజిటింగ్ అవర్స్ కేటాయించినప్పటికీ అవి సక్రమంగా అమలవుతున్నాయా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. రోజువారీ కూలీ పనులు వదులుకొని కార్యాలయాలకు వచ్చే సామాన్యుల సమయం, డబ్బు వృథా అవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.

కలెక్టర్ స్పందించాలని డిమాండ్

ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయానికి వెళ్లే రహదారిని అభివృద్ధి చేయడంతో పాటు పరిసరాల పరిశుభ్రత, అధికారుల సమయపాలన, విజిటింగ్ అవర్స్ అమలుపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కార్యాలయంలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించి, పెండింగ్ రెవెన్యూ సమస్యలను సకాలంలో పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారుల పనితీరుపై వస్తున్న ఆరోపణలపై సంబంధిత అధికారి స్పందించి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.





పొగమంచు ప్రభావం..

ఒకదానినొకటి ఢీకొన్న 86 వాహనాలు

12 మంది మృతి



ముద్ర, బల్గేరియా : దట్టమైన పొగమంచు (Fog) కారణంగా ఒకే కూడలిలో 86 వాహనాలు ఒకదానినొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో 12 మంది మృతిచెందారు. పలువురు గాయపడ్డారు. బల్గేరియా లో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. దేశ రాజధాని సోఫియా (Sofia) ను బుర్గాస్ ఓడరేవు (Burgas port) తో కలిపే రోడ్డుపై మంగళవారం ఉదయం దట్టమైన పొగమంచు కమ్ముకుంది. ఈ క్రమంలోనే యాంబోల్ సమీపంలో ఒకే ప్రదేశంలో అటు, ఇటు ఉన్న రోడ్లపై దాదాపు 86 వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఇందులో చాలావరకు ట్రక్కులే ఉన్నాయి.ఈ ప్రమాదం కారణంగా ఘటనా స్థలంలోనే 10 మంది మృతిచెందారు. ఆసుపత్రికి తరలిస్తుండగా మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. మరో 46 మందిని చికిత్స కోసం తరలించారు. సమాచారం అందుకున్న ప్రధాని రుమెన్ రాదేవ్ ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పరిశీలించారు. ఇలాంటి భయానక దృశ్యాన్ని తాను ఎన్నడూ చూడలేదని ప్రాంతీయ గవర్నర్ మిహైల్ కాషెరోవ్ చెప్పారు. దట్టమైన పొగమంచు కారణంగా దారి సరిగ్గా కనిపించకపోవడం, రోడ్డు తడిగా ఉండటం వంటివి ప్రమాదానికి దారితీసినట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555